




- ఎన్‌హెచ్ఏఐ నుంచి గుంటూరు కలెక్టరేట్‌కు ఫైనల్ డీపీఆర్
- బహిర్గతం కావడంతో రైతుల ఆగ్రహం
- 140 మీటర్ల భూసేకరణ, ఇతరత్రా ఖర్చులకే రూ. 3,117 కోట్లు..
- 250 మీటర్లంటే రూ.5 వేల కోట్లకు పైగానే నిధుల అవసరం



గాయత్రినగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, వాసిరెడ్డి లింగమూర్తి



గాయత్రి నగర్‌లో నిర్మించిన రహదారిని చూపిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

అక్షరం అండగా.. సమస్యలు పరిష్కారం

- ప్రజలు అడిగారు.. పాలకులు స్పందించారు
- రెండు నెలల్లో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం
- వినుకొండలో రూ.63.60 లక్షలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- స్థానికుల హర్షాతిరేకాల మధ్య ప్రారంభించిన చీఫ్‌విప్ జీవీ
- ప్రజలకు, పాలకులకు మధ్య వారధిగా ఆంధ్రజ్యోతి కృషికి ప్రశంసలు

- రెండేళ్లలో ఇంటింటికి తాగునీరు అందించడమే జీవితాశయం : చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంతో వినుకొండలో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయి. రోడ్లు లేక.. డ్రెయినేజి వ్యవస్థ లేక ఆయా ప్రాంతవాసులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోగా గతంలో పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. వర్షాల సమయంలో అయితే వారు ఇళ్ల నుంచి బయటకు కూడా అడుగు పెట్టలేక అల్లాడిపోతుండేవారు. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతి వినూత్నంగా చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం ద్వారా గాయత్రినగర్, కొట్నాల్ల వీధి ప్రాంతవాసులు తమ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నాడు వారు ఆయా ప్రాంతాల్లో పర్యటించగా ప్రజలు స్వయంగా తమ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆంధ్రజ్యోతి వేదికగా కోరారు. మహిళలు ఎక్కడికక్కడ సమస్యలకు సంబంధించిన అర్జీలను జీవీకి అందజేసి తమ బాధలను వినిపించారు. మహిళలు తెలియజేసిన సమస్యలపై స్పందించిన జీవీ వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టారు. ప్రజలు కోరిన ఆయా పనులు పూర్తి కావడంతో శుక్రవారం వేడుకగా ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మట్టి రోడ్లతో, డ్రెయిన్లు లేక పడిన అవస్థలు తీరడంతో



(మిగతా 8లో)

పనులు ఇలా..

- కొట్నాల్లవీధిలో రూ18.60 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు
- గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో సిమెంట్ రోడ్లు

ఎన్ఎస్‌పీ కాలనీకి వరాలు..

ఎన్ఎస్‌పీ కాలనీలో చిల్డ్రన్స్ పార్కు నిర్మాణం, గుర్రం జాషువ పేరుతో లైబ్రరీ, ఇండోర్ స్టేడియం, షాదీఖానా, టీటీడీ కల్యాణ మండపం, హోల్‌సెల్ కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు.



స్థానికులు, అర్జీలతో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

అంత.. వేడల్పా..!?

250 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్..

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని అవుటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్) తుది డీపీఆర్(సవివర ప్రాజెక్టు నివేదిక) జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ నుంచి కలెక్టరేట్‌లకు చేరుకుంది. దాదాపుగా 190 కిలోమీటర్ల వ్యాసార్థంతో గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాలో నిర్మించనున్న ఈ రాజధాని మణిహారం వెడల్పుని పెంచుకొంటూ పోతున్నారు. తొలుత 100 మీటర్ల వెడల్పుతో భూసేకరణ ప్రతిపాదించారు. ఆ తర్వాత భవిష్యత్తు అవసరాల పేరుతో 140 మీటర్ల వెడల్పునకు కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పించింది. ఇప్పుడు 250 మీటర్లు(పావు కిలోమీటర్) వెడల్పుతో తుది డీపీఆర్‌ని ఎన్‌హెచ్ఏఐ ఆమోదం తీసుకొని ఐదు జిల్లాల కలెక్టరేట్‌లకు పంపించింది. డీపీఆర్‌లో పొందుపరిచిన ఎలైన్‌మెంట్ ప్రకారం సెంటర్ లైన్ నుంచి ఇరువైపులా 125 మీటర్ల భూసేకరణ

(మిగతా 8లో)

భూ సేకరణకు రెవెన్యూ సిద్ధం

గుంటూరు జిల్లాలోని 40 గ్రామాల్లో 4792.83 ఎకరాలను సేకరణకు ప్రతిపాదనలు రూపుదిద్దుకొంటున్నాయి. అలానే పల్నాడు జిల్లాలో 1,181 ఎకరాలను సేకరించబోతున్నారు. ఇదే విధంగా కృష్ణ, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో మరో 5 వేల ఎకరాలకు పైగానే సేకరించాల్సి ఉంటుంది. భూసేకరణకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్లు వెలువడిన తర్వాత అనేకమంది కోర్టు మెట్లు ఎక్కాలని భావిస్తున్నారు. అవి తేలేసరికి ఎన్ని సంవత్సరాల సమయం పడుతుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో 140 మీటర్ల వెడల్పునకే పరిమితమై భూసేకరణ చేపడితే ప్రాజెక్టు ఖర్చు తగ్గడంతో పాటు రైతుల అభ్యంతరాలు కూడా తగ్గుతాయి. అలానే నీటివనరులకు నష్టం జరగదు. గ్రామాల్లో నివాసాలు, పరిశ్రమలు తొలగించాల్సిన పరిస్థితి ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



యూరియా బస్తా.. రూ.500

- బ్లాక్‌తో కొండెక్కిన ధర

- రైతులను పిండేస్తున్న వ్యాపారులు
- ఖరీఫ్ పరిస్థితులు రబీలోనూ పునరావృతం
- కేటాయింపులు.. అమ్మకాలు అంతటా అక్రమమే

(చీరాల, ఆంధ్రజ్యోతి)

ఎరువులు పుష్కలంగా ఉన్నాయి.. ఎక్కడా కొరత లేదు. అవసరం మేరకు ఎంత కావాలంటే అంత సరఫరా చేస్తున్నాం. అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. అదనపు ధర కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.. ఎవరైనా అలా వసూలు చేస్తే ఫిర్యాదు చేయండి ఆ వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.. అని అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఇందుకు పూర్తి విరుద్ధంగా పరిస్థితులు ఉన్నాయి. రెండు రెట్ల ధరకు యూరియా విక్రయిస్తున్నా పట్టించుకునే వారే లేరు. ధర గురించి ప్రశ్నిస్తే యూరియా లేదనే సమాధానంతో రైతులు నిరాశ చెందుతున్నారు. అత్యంత తక్కువ ధరకు లభ్య మవ్వాల్సిన యూరియాను బ్లాక్ చేసిన వ్యాపారులు ధరను అమాంతం పెంచేశారు. వాస్తవానికి యూరియా బస్తా రూ.266.50. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్కో బస్తా రూ.500 చెల్లిస్తే తప్ప దొరకడంలేదు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా అంతటా ఇదే పరిస్థితి. కృత్రిమ కొరత సృష్టించి రైతుల నుంచి ఎక్కువ మొత్తం లో వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఎరువులు కేటాయింపులు.. అమ్మకాలు అన్నింట్లో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. రబీలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో యూరియా వాడకం ఎక్కువగా ఉంటుంది. కాగా ఖరీఫ్‌లో ఏ పరిస్థితి సృష్టించారో అదే పరిస్థితి రబీలోనూ సృష్టించేందుకు కొందరు కంకణం కట్టుకున్నట్లు స్పష్టమవుతుంది. రెండో పంట కింద సాగు చేసే మొక్క జొన్నలో అధిక దిగుబడి కోసం ఎకరాకు 12 నుంచి 16 బస్తాల యూరియా

(మిగతా 8లో)

స్త్రీశక్తి.. విజయవంతం

అద్దంకి బస్టాండ్ తనిఖీలో జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, తెలంగాణలో కంటే మన రాష్ట్రంలో విజయవంతంగా స్త్రీశక్తి పథకం అమలవుతుందని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీ చేశారు. పారిశుధ్యం, తాగునీటి వసతి, ఇతర సదుపాయలను పరిశీలించి ప్రయాణికులతో మాట్లాడారు. పారిశుధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్త్రీశక్తితో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందన్నారు. ఈ క్రమంలో ప్రయాణికుల అవసరా లకు తగ్గట్లు సర్వీసులతో పాటు బస్టాండ్లలో సౌకర్యాలు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా బస్సులు పెంచుతామన్నారు. అద్దంకి డిపోకు కూడా అదనంగా సర్వీసులు కేటాయించేందుకు చర్యలు చేపడతామన్నారు. బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు పురుషులు ఆయన దృష్టికి తేగా.. మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీఎం మహబూబి, సీఆర్సీ కొండలు తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

ప్రణాళికాబద్ధంగా ధాన్యం సేకరించాలి

- 117 సేకరణ కేంద్రాలను ప్రారంభించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ భావన వశిష్ఠ

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి ప్రణాళికతో చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ధాన్యం సేకరణపై జిల్లా, మండల, సచివాలయ స్థాయి అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం సేకరించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వమే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుందనే విషయంపై వ్యవసాయశాఖ సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. మండలస్థాయిలో ఎన్ని ఎకరాల్లో సాగు చేశారో, ఎంత దిగుబడి వస్తుందనే దానిపై ఎక్కడికక్కడ అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఆర్.ఎస్‌కెలకు ఏరోజు ఎంతమంది రైతులు వస్తారో ముందస్తుగా అంచనా వేసుకుని ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 117 ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. రైస్‌మిల్లుల వివరాలు అందుబాటులో ఉండాలన్నారు. రైతులతో వాట్సాప్‌గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. జేసీ భావనవశిష్ఠ మాట్లాడుతూ 60 తేమ యంత్రాలు సిద్ధంగా ఉంచామని, 73 మిల్లులను ఎంపిక చేశామన్నారు. 13 లక్షల గోనె సంచులను సిద్ధం చేశామన్నారు. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేయాలన్నారు. అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి అమీర్‌బాషా, మేనేజర్ శివపార్వతి, వ్యవసాయశాఖ డీడీ అన్నపూర్ణ, సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వంత్, ఆర్డీవోలు, మండల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



రాజ్యలక్ష్మికి.. కన్నీటి వీడ్కోలు

- 14 రోజుల తర్వాత అమెరికా నుంచి కారంచేడుకు మృతదేహం



రాజ్యలక్ష్మి (ఫైల్‌ఫొటో)

కారంచేడు(పర్చూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్లి అనారోగ్యంతో మృతి చెందిన యార్లగడ్డ రాజ్యలక్ష్మి(రాజీ) మృతదేహం శుక్రవారం స్వగ్రామం కారంచేడుకు చేరుకుంది. అమెరికా నుంచి 14 రోజుల తర్వాత ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని తరలించి కుటుంబసభ్యులకు అప్పగించారు. వాహనం నుంచి మృతదేహాన్ని దించగానే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఉన్నత స్థాయిలో తమ బిడ్డ వస్తుందని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు గుండెకోత మిగిలింది. మృతదేహానికి గ్రామంలోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. విద్యార్థిని కడచూపు కోసం పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు.



ఎన్టీఆర్ సహకార భవన్

డీసీసీబీ అక్రమార్కులపై వేటు

- ఇద్దరు మాజీ సీఈవోల సస్పెన్షన్
- లాల్‌పురం రాము సహా పాలకవర్గంపై క్రిమినల్ చర్యలు

నల్లపాడు బ్రాంచ్‌లో రూ.22.25 కోట్ల కుంభకోణం జరిగినట్లు నిర్ధారణ

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ అక్రమార్కులపై వేటు పడింది. నల్లపాడు బ్రాంచ్‌లో జరిగిన అక్రమాలపై ఇద్దరు మాజీ సీఈవోలు కృష్ణవేణి, అజయ్‌కిశోర్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ పాలకవర్గం శుక్రవారం తీర్మానించింది. వైసీపీ హయాంలో జీడీసీసీబీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. ప్రధానంగా నల్లపాడు బ్రాంచ్‌లో ప్లెడ్జి రుణాల మంజూరు, డ్వాక్రా గ్రూపుల పేరుతో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సెక్షన్ 51 విచారణకు ఆదేశించింది. ప్లెడ్జి రుణాల పేరుతో రూ.13.15 కోట్లు, మెప్మా పరిధిలో రూ.6.05 కోట్లు, డీఆర్‌డీఏ స్వయం సహాయ సంఘాలకు రూ.1.41 కోట్లు, జగనన్న మహిళా ధీమా కింద రూ.1.2 కోట్లు, దీర్ఘకాలిక రుణాలుగా రూ.37 లక్షలు మంజూరు.. ఇలా రూ.22.25 కోట్లు అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలింది. ఈ అక్రమాలకు బాధ్యులుగా అప్పటి పాలకవర్గం రాతంశెట్టి సీతారామాంజనేయు(లాల్‌పురం రాము)లుతో పాటు పాలకవర్గ సభ్యులుగా తేల్చారు. ఈ క్రమంలో వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రస్తుత చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు. అలానే ప్లెడ్జి రుణాలకు సంబంధించి 191 మంది, మెప్మా పరిధిలో 212 మంది, డీఆర్‌డీఏ పరిధిలో 60 మంది, జగనన్న మహిళా ధీమా కింద వ్యక్తిగత రుణాలు పొందిన 320 మంది, నిబంధనలకు విరుద్ధంగా దీర్ఘకాలిక రుణాలు పొందిన మరో 13 మంది ఇలా మొత్తం 796 మందిపై సివిల్ చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. 186 మందిపై క్రిమినల్, 27 మందిపై క్రమశిక్షణా చర్యలు, బ్యాంకు సిబ్బంది 10 మంది, డీఆర్‌డీఏలో ఆరుగురు, మెప్మా సిబ్బంది 11 మందిపై కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సస్పెన్షన్ చేస్తూ తీర్మానం

విచారణ నివేదిక నేపథ్యంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన అధ్యక్షతన శుక్రవారం బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకార భవన్‌లో జరిగిన సమావేశంలో ఇద్దరు మాజీ సీఈవోలపై వేటు వేస్తూ తీర్మానం చేశారు. మొత్తానికి బ్యాంకులోని తాజా పరిణామాలు హాట్ టాపిక్‌గా మారాయి.



బాపట్ల మండల పరిధిలోని మూలపాలెం-జిల్లెళ్లమూడి రోడ్డు దుస్థితి

రోడ్లు.. గోతులమయం

- వర్షాలతో అధ్వానంగా మారిన వైనం
- 70 శాతం బిల్లుల చెల్లింపులో జాప్యం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రోడ్డుపై గుంత కనపడకూడదు. రోడ్లపై గోతులతో వాహనదారులు ఇబ్బందులు పడకూడదు. సంక్రాంతి కల్లా రోడ్ల మరమ్మతులు చేయాలి. గత వైసీపీ హయాంలోని పరిస్థితి ఎక్కడా కనిపించకూడదు.. అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి ఎక్కడా కానరావడంలేదు. గతంలో ఉన్నంతగా గోతులు లేకపోయినా పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రభుత్వం ఒక మారు గోతులను పూడ్చివేయగా తుఫాన్, భారీ వర్షాలతో ఎక్కడికక్కడ రోడ్లు అధ్వానంగా మారాయి. తూతూమంత్రంగా చేపట్టిన పనులు కూడా వర్షాలతో బహిర్గమయ్యాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రధాన రహదారులతో పాటు పంచాయతీ, మున్సిపల్ పట్టణాల్లో రోడ్లు గోతులతో నిండి.. వాహన చోదకులకు నరకం చూపుతున్నాయి. గతంలో కేటాయించిన నిధులతో చేపట్టిన పనుల్లో 70 శాతం బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. జిల్లాలో 108 పనులకు రూ.31 కోట్లను గతేడాది చివరిలోనే కేటాయించగా రూ.27 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తుఫాన్‌తో గ్రామీణ రహదారులు 147 కిలోమీటర్లలో, ఆర్అండ్‌బీ రోడ్లు 152 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. బాపట్ల మండలం మూలపాలెం -జిల్లెళ్ళమూడి రోడ్డు వాహనదారులకు నరకం చూపు తోంది. చిన్న పాటి వర్షానికే రోడ్డుపై చెరువును తలపిస్తోంది. కంకటపాలెం, చెరుకూరు రోడ్లు పగుళ్లతో ప్రమాదకరంగా ఉన్నాయి. చీరాల పరిధి లోని ఈపురుపాలెం, తోటవారి పాలెం, గవినివారిపాలెం, ఏరి యా వైద్యశాల రోడ్లు నరకప్రాయంగా మారా యి. పర్చూరు పరిధిలో దాదాపు 52 గ్రామీణ రోడ్లు, అద్దంకి, రేపల్లె నియోజకవర్గాల పరిధిలో ఆర్అండ్‌బీ 21, పంచాయతీరాజ్ 82 నరసాయపాలెం--నరసాయపాలెం రోడ్లకు తక్షణం మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.



చీరాల మండల పరిధిలోని ఆంధ్రకేసరి నగర్‌లో భయానకంగా ప్రధాన రహదారి

జగన్ బలప్రదర్శన తప్పుడు సంకేతం

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాల ఎదుట నేరస్తుల బల ప్రదర్శన న్యాయవ్యవస్థపై ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపుతుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నియంతృత్వ పోకడలు, రాజ్యాంగ విరుద్ధ చర్యలపై న్యాయస్థానాలు కఠినంగా వ్యవహరించాలని కోరారు. అడ్డగోలుగా ఆర్థిక నేరాలకు పాల్పడి, ఇప్పటికే 16 నెలల జైలు జీవితం గడిపిన జగన్‌మోహన్‌రెడ్డి.. తాజాగా సీబీఐ కోర్టుకు హాజరయ్యే క్రమంలో హంగామా సృష్టించడం ప్రజాస్వామ్య నిబంధనలకు పూర్తి విరుద్ధమన్నారు. న్యాయమూర్తుల ఎదుట బలప్రదర్శనలు.. కోర్టుకు గైర్హాజరు అవ్వాలన్న జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తు ప్రణాళికలో భాగమేనన్నారు.

రూ.60 లక్షల నకిలీ సిగరెట్ల పట్టివేత



కంటైనర్ తనిఖీ చేస్తున్న సీఐలు

రేపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనుమతులేని నకిలీ సిగరెట్ల కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి పెనుమూడి జాతీయ రహదారి వద్ద తనిఖీలు నిర్వహించగా.. ఓ కంటైనర్‌లో నకిలీ సిగరెట్లను గుర్తించామని తెలిపారు. పోలీస్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రెవెన్యూ అధికారుల సమక్షంలో తనిఖీ చేయగా.. సుమారు రూ.60లక్షలు నకిలీ సిగరెట్లకు.. జీఎస్టీ, బిల్లులు లేవని తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ కె.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

'సీనియర్స్'లో తెలంగాణ ఎడ్ల సత్తా



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు బ్రహ్మానందరెడ్డి, ఆంజనేయులు

కారంపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాల సందర్భంగా స్థానిక నూతన బస్టాండ్ సమీపంలో శుక్రవారం సీనియర్ విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. తెలంగాణలోని హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి ఎడ్ల జత 2,330 అడుగులతో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 2,250 అడుగులతో ద్వితీయ స్థానంలోనిలిచింది. కృష్ణా జిల్లా విజయవాడకు చెందిన పొందుగుల ఈశ్వర్ ఎడ్లజత తృతీయ స్థానం, నంద్యాల జిల్లా గోస్పాడుకు చెందిన గోటికే హెత్విక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి ఎడ్లజత నాలుగో స్థానం, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పాలువూరి వీరస్వామి చౌదరి ఎడ్ల జత ఐదోస్థానం, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారానికి చెందిన లక్కు నాగ శివశంకర్ ఎడ్లజత ఆరోస్థానం, విజేత ఎడ్ల యజమానులకు సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్ సోదరి నాగలక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. సొసైటీ ఛైర్మన్ రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు, గ్రామ పెద్ద బొమ్మిన శ్రీనివాసరావు, చింతపల్లి రామ్మూర్తి, పలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌లపై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో.. శుక్రవారం చిరు ధాన్యాల ప్రాసెసింగ్ ద్వారా మహిళా సాధికారితపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల ఆర్థిక సాధికారితకు.. ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్ వివరించారు. ఆరోగ్యం సంరక్షణలో చిరుధాన్యాలకు డిమాండ్ ఉందన్నారు. గ్రామీణ మహిళలు చిన్న యంత్రాలు ఉపయోగించి ప్రాసెసింగ్ యూనిట్‌ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను వివరించారు. సెర్ప్ సంస్థ ప్రతినిధి పార్థసారథి మాట్లాడుతూ ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఎంఎస్ఎంఈ వంటి పథకాల కింద ప్రాసెసింగ్ యూనిట్‌లకు రుణాలు, రాయితీలు లభిస్తాయన్నారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగించుకుని.. సులభంగా వ్యాపారం ప్రారంభించవచ్చన్నారు. ప్రాసెసింగ్ నిపుణులు డాక్టర్ విష్ణువర్ధన్, జి.రవిబాబు, డాక్టర్ బి.శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ కె.వి.ఎస్.రామిరెడ్డి, డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్, డాక్టర్ కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమగ్రాభివృద్ధికి పటిష్ఠ కార్యాచరణ

కృష్ణానదిలో చేప పిల్లలు విడుదల చేసిన కలెక్టర్ అన్సారియా



చేపపిల్లలను విడుదల చేస్తున్న కలెక్టర్ అన్సారియా, సబ్ కలెక్టర్ సంజన

తాడేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పటిష్ఠ కార్యాచరణ అమలు చేస్తోందని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం ప్రకాశం బ్యారేజి జలాశయంలో.. ఉండవల్లి పడవల రేవులో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహతో కలిసి చేప పిల్లలను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్‌లో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక మత్స్య రంగాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. బ్యారేజి జలాశయంలో 23.50 లక్షల చేప పిల్లలను విడుదల చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ప్రకాశం బ్యారేజి జలాశయంతోపాటు నాలుగు మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, జిల్లాలోని 202 గ్రామాల మంచి నీటి చెరువుల్లోనూ మత్స్య సంపదను వృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్యకారులకు మార్కెటింగ్ సౌకర్యం కోసం ఫిష్ వెండింగ్ యూనిట్లను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆరు మత్స్యకార సంఘాలకు నూరు శాతం రాయితీతో మంజూరు చేసిన రూ.10,11,978 చెక్కును అందజేశారు. గుంటూరు చేపల మార్కెట్‌లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కిరణ్, మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు భూశంకర్, ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి, ఎంపీపీ కృష్ణ, ఎంపీటీసీ శివకుమారి, తహసీల్దార్ సీతారామయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రావు, మత్స్యకారులు పాల్గొన్నారు.

హామీలు.. వంద శాతం పూర్తి చేస్తాం

● మంత్రి పొంగూరు నారాయణ

తుళ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇచ్చిన హామీలన్నీ వంద శాతం పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. రైతులతో ఎవరు అవహేళనగా మాట్లాడలేదని, రైతులకు ఏ సమస్య వచ్చినా రాజధానిలోని సీఆర్డీఏ కార్యాలయంలో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. శుక్రవారం రాజధాని గ్రామాలైన వెంకటపాలెం, ఉద్దండరాయుని పాలెంలో నిర్మాణం జరుగుతున్న 15 అంగన్‌వాడీ, 14 వీహెచ్‌సీ, 14 పాఠశాలలు, ఒక మల్టీ పర్పస్ శ్మశాన వాటిక నిర్మాణాలను మంత్రి పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రి మాట్లాడుతూ, గ్రామ కంఠాలు, జరీబు, లంక భూముల సమస్యలపై ప్రతిరోజూ అధికారులతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. లంక భూములకు ఎన్జీటీ అనుమతులు ఇవ్వడం లేదని, ఒకరిద్దరు రైతులు తమకు కోరుకున్న చోటా ప్లాట్స్ కావాలని డిమాండ్ చేస్తున్నారని, నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కడ రిటర్నబుల్ ప్లాట్స్ ఇచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. రాజధాని రైతులకు ఇచ్చిన ప్లాట్‌లలో మౌలిక సదుపాయల కల్పన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రాజధానిలో మొత్తం 29,421 మంది రైతులకు 61,433 ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయని తెలిపారు. కేవలం 2,270 మంది రైతులకు 7,988 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, ప్రతిరోజు 30 నుంచి 40 రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయని వివరించారు. గత 21 రోజుల్లో 231 మందికి 443 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తి చేశామని తెలిపారు. కోర్టు కేసులు, కుటుంబ తగాదాలు కారణంగా కొన్ని ప్లాట్ల కేటాయింపు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఒకరిద్దరు రైతులు అనవసరంగా సోషల్ మీడియాలో రకరకాల పోస్టులు పెడుతున్నారని, రైతులు ఎవరికీ అన్యాయం జరగదన్నారు. మూడేళ్లలో రాజధాని పూర్తి చేసి తీరుతామని మరోసారి మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

విజ్ఞాన్ వర్సిటీని సందర్శించిన అమెరికా బృందం



అమెరికా వర్సిటీ బృందంతో చైర్మన్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు (విద్య) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయాన్ని యూఎస్ఏ ఓహియోలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ (బీజీఎస్‌యూ) ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించినట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ తెలిపారు. బీజీఎస్‌యూ ప్రెసిడెంట్ డాక్టర్ రోడ్నే కె.రోజర్స్, అడ్వకేట్ డాక్టర్ సాండ్రా బి. ఎర్లే, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి క్రోవి, అకడమిక్ అఫైర్స్ వైస్ ప్రొవోస్ట్ డాక్టర్ రోడ్నే కె. రోజర్స్, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ డీన్ డాక్టర్ వేల్ మోక్తర్ తదితరులకు వర్సిటీ తరపున ఆత్మీయ స్వాగతం పలికారు.కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ విజ్ఞాన్, బీజీఎస్‌యూ మధ్య ఉన్న అవగాహన ఒప్పందం కేవలం విద్యార్థి మార్పిడికి మాత్రమే కాకుండా అంతర్జాతీయ విద్యా పరిశోధన సహకారానికి కూడా అని తెలిపారు. రెండు యూనివర్సిటీల అధ్యాపకులు ఒకరికొకరు వర్సిటీల్లో తాత్కాలికంగా బోధించే అవకాశం ఉంటుందన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీరావు, డీన్లు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే నరేంద్ర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పొన్నూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. చింతలపూడిలోని ఎమ్మెల్యే స్వగృహంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య జాబ్ మేళా ప్రచార పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 13న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో.. 50 ప్రముఖ సంస్థల ప్రతినిధులు వెయ్యికి పైగా ఉద్యోగాల భర్తీకి రానున్నట్లు చెప్పారు. డిగ్రీ నుంచి అన్ని విద్యార్హతలున్న అభ్యర్థులు.. హాజరు కావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ, కోశాధికారి పులిపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు లలిత శాస్త్రి, మాచిరాజు మురళీకృష్ణ, సుబ్రహ్మణ్య శర్మ, ఆముదాలపల్లి రామకృష్ణ, శేష తల్పసాయి, దేశరాజు బాలగంగాధర్ తిలక్, మాజేటి నాగరాజు, తాడేపల్లి వెంకటర్నం, రేటూరు చక్రధర్ రావు, పులిజాల సాంబశివరావు, మునిపల్లె మురళి పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



లారీని అడ్డుకుంటున్న గ్రామస్తులు

యడ్లపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకాయలపాడు రెవెన్యూ పరిధిలో జరుగుతున్న మట్టి తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. శివారు ఉప్పరపాలెం గ్రామస్తులు శుక్రవారం సాయంత్రం గ్రామ పరిధిలోని గురుకుల పాఠశాల వద్దకు చేరుకుని అక్రమ తవ్వకాలను నిలుపుదల చేశారు. గ్రావెల్ తరలిస్తున్న లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాల సమీపంలోని ప్రభుత్వ భూముల్లో గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మట్టి తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, దీనితో తామే తవ్వకాలను అడ్డుకున్నట్లు తెలిపారు.

డ్రాఫ్టింగ్ అండ్ ప్లీడింగ్స్ సర్టిఫికెట్ కోర్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ, రెక్టార్ తదితరులు

ఏఎన్‌యూ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఆధ్వర్యంలో డ్రాఫ్టింగ్ అండ్ ప్లీడింగ్స్ సర్టిఫికెట్ కోర్సు బ్రోచర్‌ను వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ ఆర్.శివరాంప్రసాద్ శుక్రవారం సంయుక్తంగా ఆవిష్కరించారు. న్యాయ విద్యార్థులకు సరికొత్త కోర్సుల ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు ఇలాంటివి దోహదపడతాయని వీసీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. న్యాయ విభాగపు అధిపతి ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి ఈ కోర్సు నాన్ జ్యుడీషియల్ సిబ్బందికి, న్యాయవాద గుమస్తాలకు, టైపిస్టులకు, న్యాయ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. డిసెంబరు 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కోర్సు కొనసాగుతుందన్నారు. కోర్సు ఫీజును రూ.10,000గా నిర్ణయించినట్లు తెలిపారు. వర్సిటీ సిబ్బంది, విద్యార్థులకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని, వర్సిటీ వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచినట్లు చెప్పారు. డిసెంబరు 15వ తేదీ వరకు గడువు ఇచ్చారని, అనంతరం అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. న్యాయవిభాగపు అధ్యాపకులు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ శివరాం, అభిలాష్ గోపీనాథన్ పాల్గొన్నారు.

అవాస్తవ ప్రచారంపై కఠిన చర్యలు

వాస్తవాలను వక్రీకరిస్తూ రాస్తున్న ఒక ఆన్‌లైన్ పేపర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని పీజీ కో-ఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు పేర్కొన్నారు. ప్రశ్నపత్రం లీకేజీ ఎక్కడ జరిగిందో చెప్పాలని లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎం.కామ్ పరీక్ష థర్డ్ సెమిస్టర్ 3, 4 పేపర్లో ఒక ప్రశ్న రెండు సార్లు రిపీట్ అయ్యిందని.. ఇన్విజిలేటర్ విషయం తెలియజేయగా వెంటనే సెకండ్ సెట్ పేపర్ ఇచ్చామన్నారు. తనపై తప్పుడు అభియోగాలు తీసుకొస్తూ మానసిక క్షోభ కు గురిచేస్తున్నారన్నారు.

బాలికపై అత్యాచార యత్నం.. 20 ఏళ్ల జైలు

తెనాలి క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మైనర్ బాలికపై అత్యాచార యత్నం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తెనాలి పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. తెనాలి వైకుంఠపురంలోని పూరి గుడిసెల్లో నివాసం ఉండే ఒక కుటుంబానికి చెందిన ఆరు, ఏడేళ్ల వయస్సున్న అక్కా చెల్లెళ్లు 2021 జనవరి 1న మధ్యాహ్నం సమీపంలోని కట్ట వద్ద బహిర్భుమికి వెళ్లారు. ఇది గమనించిన అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ బిల్లా డేవిడ్‌రాజ్ (32) వారిని అనుసరించాడు. వెనుక నుంచి వచ్చి ఆరేళ్ల బాలికపై అఘాయిత్యానికి యత్నించాడు.. బాలిక అరవడంతో సమీప ప్రాంతాల వారు వచ్చి బాలికను రక్షించారు. ఈ మేరకు వన్ టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేయగా, అప్పటి డీఎస్పీ స్రవంతిరాయ్ కేసు దర్యాప్తు చేశారు. నరసరావుపేట దిశా ఉమెన్స్ స్టేషన్ అప్పటి డీఎస్పీ యు.రవిచంద్ర చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్షణ, రూ.10 వేలు అపరాధ రుసుం విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం బాధిత బాలిక కుటుంబానికి రూ.4 లక్షలు నష్టపరిహారం.. 30 రోజుల్లో అందించాలని ఆదేశాలిచ్చారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలినేని రాఘవయ్య ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

పండ్ల తోటలను సందర్శించిన కేంద్ర బృందం



గుట్లపల్లిలో భవన నిర్మాణాన్ని పరిశీలించిన బృంద సభ్యులు

వినుకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అందుగుల కొత్తపాలెంలో ఎంఐడీహెచ్ పథకంలో భాగంగా పండిస్తున్న పండ్లు, పూలు, కూరగాయల తోటలను కేంద్ర బృందం శుక్రవారం సందర్శించింది. పండ్ల తోటల పెంపకం ద్వారా ఆదాయ వనరుల గురించి బృందం సభ్యులు రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ అందుతుందా లేదా అని అడిగారు. అనంతరం బొల్లాపల్లి మండలం గుట్లపల్లి గ్రామంలో నిర్మిస్తున్న కూరగాయలు, సుగంధ ద్రవ్యాల భవన నిర్మాణాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి. ఐ. వెంకట్రావు, కేంద్ర బృందం సభ్యులు కె. మనోజ్, అండర్ సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్, రాజీవ్ కుమార్, హేమంగా భార్గవ్, ఏపీఎస్పీ జమదగ్ని, వినుకొండ, గురజాల ఉద్యాన అధికారులు ఎస్కే. నబి రసూల్, వై.మోహన్ పాల్గొన్నారు.

సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 584.60 అడుగులు ఉంది. ఇది 296.28 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,019, ఎడమ కాలువ ద్వారా 3,259, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,130, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 47,508 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

నలుగురు దొంగల అరెస్టు

రూ.80 లక్షల చోరీ సొత్తు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బి.కృష్ణారావు

నరసరావుపేట లీగల్, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం, రూరల్, వినుకొండ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పలు చోరీలకు పాల్పడిన నలుగురు దొంగలను గురువారం పట్టణంలోని అంధ పాఠశాల వద్ద అరెస్టు చేసినట్లు ఎస్పీ కృష్ణారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని బరంపేటకు చెందిన పేరేచర్ల వంశీ, పెద్ద చెరువుకు చెందిన వేముల తిరుపతిరావు, రామిరెడ్డిపేటకు చెందిన మీసాల రాజేష్, మాచర్లకు చెందిన బండారు బాలయ్య బేల్దారి పని చేస్తుంటారని తెలిపారు. పనికి వెళ్లే సమయంలో సులభంగా దొంగతనాలు చేయవచ్చని ప్లాన్ వేసి.. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పారు. నిందితులు నరసరావుపేట పట్టణం రూరల్ వినుకొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ఏడాది ఆరు దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు. నిందితుల నుంచి సుమారు రూ.80 లక్షలు విలువైన చోరీ సొత్తును రికవరీ చేసినట్లు తెలిపారు. ఇందులో సుమారు 610 గ్రాముల బంగారం, రెండు ల్యాప్‌టాప్‌లు, ఐదు గడియారాలు, చోరీ సొత్తుతో కొనుగోలు చేసిన ఆటో, బైక్ ఉన్నట్లు చెప్పారు. వీరిని పట్టుకోవడంలో.. కీలకంగా పనిచేసిన మొదటి పట్టణ సీఐ షేక్ ఫిరోజ్, ఎస్సై వంశీకృష్ణ, ఏఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది సీహెచ్ వీరాంజనేయులు, బి.మురళీకృష్ణ, కె.తిరుమలరావు, ఎస్.పాండురంగారావు, పి.కోటేశ్వరరావు, పి.దుర్గాను ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

42,133 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 38,257 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,133 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,334 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	11500	14300
			ఏసీ కామన్ వెరైటీ		
334	10000	18500	334	10500	18000
నెంబరు. 5	11500	16000	నెంబరు. 5	12000	16400
273	---	---	341	11500	18000
341	10000	17500	4884	11000	14500
4884	---	---	సూపర్ 10	---	---
సూపర్ 10	---	---	ఏసీ స్పెషల్ వెరైటీ		
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తేజ	11000	16000
తేజ	10000	16000	బ్యాడిగి	10000	18500
షార్క్-1	---	---	దేవనూరు డీలక్స్	10500	17500
బ్యాడిగి	11000	18300	తాలుకాయలు	5000	9000
దేవనూరు డీలక్స్	11000	17500			

నేడు పెమ్మసాని, నారాయణ, శ్రావణ్‌కుమార్ సమావేశం

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల సమస్యల నేపథ్యంలో శనివారం ఉదయం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సమావేశం కానున్నారు. సీఆర్డీఏ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు రాజధాని అంశాలపై ఈ ముగ్గురూ దృష్టి సారించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు భేటీ కానున్నారు. సమస్యలపై సీఆర్డీఏ కమిషనర్‌తో చర్చించనున్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో ఇటీవల రైతు జేఏసీ గుంటూరులో సమావేశమై ప్రభుత్వం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జరిగుతున్న సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ప్రజల సమస్యలను పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : వారంలో నాలుగురోజులపాటు ప్రజలకు అందుబాటులో ఉండి వారి ప్రతి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని నియోజకవర్గ విజన్‌యాక్షన్ ప్లాన్‌యూనిట్‌లో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతం నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకొని సంబంధితాధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాదర్బార్‌కు పెద్దఎత్తున ప్రజలు వచ్చి అర్జీలు అందజేస్తున్నారన్నారు. మంగళ, బుధ, శుక్రవారాలలో విజన్ కార్యాలయంలో, గురువారం పార్టీకార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. సోమవారం, శనివారం అమరావతి రాజధానికి వెళ్ళి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతోపాటు ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వంలో చేయని పనులన్ని బాధ్యతగా చేస్తున్నామన్నారు. శక్తివంచన లేకుండా ప్రజలకు సేవందిస్తానని చెప్పారు. ఎక్కువగా భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు వస్తున్నారన్నారు. వీటన్నిటిని పరిష్కరిస్తానని చెప్పారు.

పరిపాలన సౌలభ్యం కోసమే అందుబాటులో రికార్డులు

● బాపట్ల గ్రూప్ ఆఫ్ టెంపుల్ ఈవో డి.రజనీకుమారి


రజనీకుమారి

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పరిపాలన సౌలభ్యం కోసం ప్రస్తుతం నిర్వహించే రికార్డులను కార్యాలయంలో అందుబాటులో ఉంచుకున్నట్లు బాపట్ల గ్రూప్ ఆఫ్ టెంపుల్ ఈవో డి.రజనీకుమారి తెలిపారు. శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి దేవాలయం రికార్డులు మొత్తం తూర్పు సత్రానికి తరలించారంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. శ్రీభావన్నారాయణస్వామి దేవాలయం, శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయం, తూర్పుసత్రం, వాటి అనుబంధ సత్రాలకు తాను ఈవోగా ఉన్నానన్నారు. తూర్పుసత్రంలో ఈవో కార్యాలయం ఉంది కావున దేవాలయానికి సంబంధించి ప్రస్తుతం నిర్వహించే రికార్డులు కార్యాలయానికి తీసుకురావటం జరిగిందన్నారు. భావన్నారాయణస్వామి దేవాలయంలో ఈవో కార్యాలయ భవన సముదాయం లేని కారణంగానే తూర్పు సత్రం నుంచి విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వటం జరిగిందని, దీనిపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయటం సరికాదన్నారు.

కఠినంగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం : కమిషనర్

బాపట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయటానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని పలు దుకాణాలలో శుక్రవారం తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్‌సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్ కరుణ, సయ్యద్ నజీర్‌ల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జనసేన నాయకుడి కుటుంబానికి అండగా ఉంటాం

● అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సురేష్ తదితరులు

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిన జనసేన నాయకుడు కూనపురెడ్డి ఉమామహేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని జనసేననాయకుడు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ తెలిపారు. కొండుబొట్లపాలెం గ్రామంలోని మృతుని కుటుంబాన్ని శుక్రవారం ఆయన పార్టీశ్రేణులతో వెళ్ళి పరామర్శించారు. మృతుడి కుమారుడి చదువు బాధ్యత తాను తీసుకుంటానని హామినిచ్చారు. అదేవిధంగా నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన జనసేన నాయకులు గరిగంటి సుధీర్, గరిగంటి శ్రీనివాసరావుల సహకారంతో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు దాసరి ఏసుబాబు, కర్లపాలెం అధ్యక్షులు గొట్టిపాటి శ్రీకృష్ణ, నల్లమోతువారిపాలెం నాయకులు తాండ్ర రాధాకృష్ణ, సాయిన రాంబాబు, గుర్రాల వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీలకు హైవెండ్ విద్యార్థులు


ధనుష్‌రెడ్డి, సాయి హర్షవర్ధన్‌రెడ్డిలను అభినందిస్తున్న ఎండీ సాయిమహేంద్రబాబు, డైరెక్టర్ చాందిని

కర్లపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు చదువుతోపాటు పలు క్రీడలలో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ఎంపికై పాఠశాలకు, తల్లిదండ్రులకు, కర్లపాలేనికి మంచిపేరు ప్రతిష్ఠలు తీసుకొస్తున్నారని ఎండీ బొడ్డు సాయిమహేంద్రబాబు అన్నారు. హైవెండ్ హైస్కూల్‌కు చెందిన ఆట్ల ధనుష్‌రెడ్డి అండర్-14, 17లో, పుట్టా సాయిహర్షవర్ధన్‌రెడ్డిలు పల్నాడు జిల్లాలోని కొర్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 19న 69వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ బేస్‌బాల్ పోటీలు నిర్వహించగా ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. నవంబరు 29 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఆట్ల ధనుష్‌రెడ్డి, పుట్టా సాయిహర్షవర్ధన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. హైవెండ్ హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం ధనుష్‌రెడ్డి, సాయిహర్షవర్ధన్‌రెడ్డి, పీఈటీ వీరశేఖర్‌లను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఉదయచంద్రరావు, డైరెక్టర్ చాందిని, అంజనేయప్రసాద్, వెంకటజ్యోతి, ఉపాధ్యాయులు రఫీ, షర్మిలబేగం, పరీదా, జెరీనా తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వాసంతి


వాసంతిని అభినందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు కరీముల్లా, హెచ్ఎం భూపతిరావు తదితరులు

పిట్టలవానిపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యనభ్యసిస్తున్న బెల్లంకొండ వాసంతి అండర్-17 బాలికల విభాగంలో అథ్లెటిక్స్ లాంగ్‌రన్‌లో 3000, 1500 పరుగు పందెంలో జిల్లా స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ కరీముల్లా శుక్రవారం తెలిపారు. బెల్లంకొండ వాసంతికి పాఠశాలలకు చెందిన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలు బేతాళం శారద చిరంజీవి మంతెన వసుధ పేరుతో రూ.5 వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. అనంతరం పాఠశాల పీఈటీ షేక్ కరీముల్లాను, విద్యార్థిని వాసంతిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేముల భూపతిరావు, విద్యాకమిటీ చైర్మన్ సాంబమూర్తి రాజు, స్టాఫ్ సెక్రటరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 24, 25 తేదీలలో పల్నాడు జిల్లా వినుకొండలోని లయోల స్కూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో వాసంతి పాల్గొంటున్నట్లు తెలిపారు.

మన చేతుల్లోనే మన భవిష్యత్తు : సీఐ

బాపట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మన భవిష్యత్తు మనచేతుల్లోనే ఉందని పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, నివారణ తదితర అంశాలపై శుక్రవారం వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తూ పురవీధులలో అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి సీఐ రాంబాబు మాట్లాడుతూ ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. వాహనాలు అతివేగంగా నడపటం, ర్యాష్‌డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపటం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డుప్రమాదాలు వల్ల యువత భవిష్యత్తు నాశనమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం అక్బర్‌పేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాలల హక్కుల కోసం ఐక్యరాజ్యసమితిలో తీర్మానం చేయటం జరిగిందన్నారు. ప్రతిబిడ్డకు ప్రతిహక్కు అనేనినాదంతో బాలల హక్కుల వారోత్సవాలు జిల్లా స్థాయిలో నిర్వహించటం జరిగిందన్నారు. పిల్లలందరూ చదువు మీద శ్రద్ధపెట్టి ఉన్నత స్థానాలకు వెళ్ళాలన్నారు. బాపట్ల జిల్లాను బాల్య వివాహరహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. బాలలు అత్యవసర పరిస్థితులలో 1098 నెంబర్‌ను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, సాంఘిక సంక్షేమశాఖాధికారిణి జె.రాజాదెబోరా, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, ఉమ్మడి సెల్ సీఐ శ్రీనివాసరావు, జీసీడీవో చారులత, సుధా, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, సీడీపీవోలు, సూపర్‌వైజర్‌లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని నిర్వహణ నైపుణ్యాలను అలవర్చుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరుగుతున్న దీక్షారంభ్ 11వరోజు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ మానవ జీవితంలో ఎత్తు పల్లాలు సహజమని ఉన్నత స్థితిలో ఉన్నప్పుడు పొంగిపోకుండా, పతనావస్థకు చేరుకున్నప్పుడు కృంగిపోకుండా స్థిరంగా ఉండాలన్నారు. పవిత్రమైన వైద్య వృత్తినిసైతం వదులుకొని ప్రతి ఒక్కరికి సేవ చేసే అవకాశం ఉందని భావించి సివిల్‌సర్వీస్ పరీక్షలు కష్టపడి చదివి మొదటి ప్రయత్నంలోనే ఐఏఎస్ సాధించానని తెలిపారు. కార్యక్రమానికి కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి అధ్యక్షత వహించగా అకడమిక్ అధికారి డాక్టర్ లాల్ అహ్మద్ మొహ్మద్, డాక్టర్ ఎం.శ్రీరేఖ, డాక్టర్ ఎం.సంధ్య, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యలు నిశితంగా పరిశీలించి పరిష్కరించాలి

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : భూసమస్యలను రెవెన్యూ అధికారులు నిశితంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. భూ సమస్యలు, రెవెన్యూ అంశాలపై సంబంధిత రెవెన్యూశాఖాధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం అయ్యారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యలపై నమోదైన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ చెప్పారు. నిషేధిత భూములపై ఫిర్యాదులు వస్తే ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ అంశాలపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, మండల తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం యంత్రాలు భద్రంగా ఉన్నాయి : కలెక్టర్

ఈవీఎం యంత్రాలు భద్రంగా ఉన్నాయని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఈవీఎం గోదాములను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరించి గోదాముల భద్రతను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పని తీరుపై ఆరా తీశారు. పోలీసు భద్రతను పరిశీలించారు. ఎలాంటి సమస్యలు రాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్ సలీమా, సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల ఫార్మసీ కళాశాలలో వర్క్‌షాపు

బాపట్లరూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో కంప్యూటేషనల్ టూల్స్ ఇన్ యుద్రా విజిలెన్స్ అనే అంశంపై విద్యార్థులకు ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. ఇన్ఫోసిస్ లిమిటెడ్ సీనియర్ కన్సల్టెంట్ రాజేష్ పాల్గొని వర్క్‌షాపు నిర్వహించారని తెలిపారు. ఫ్యారామెకో విజిలెన్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పాత్ర, ప్రాముఖ్యత, డాక్టర్స్ పెషెంట్‌కు రాసే ప్రిస్క్రిప్షన్‌లో ఎడీఆర్‌ను నివారించేందుకు వివిధ కంప్యూటేషనల్ టూల్స్, నూతన సాఫ్ట్‌వేర్స్ ఎలా ఉపయోగించుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నిర్వాహకులను అభినందించారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కర్లపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ముస్లిం మైనార్టీల కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కర్లపాలెం గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా అన్నారు. కర్లపాలెం పంచాయతీలోని దండుబాటలోని మసీదులో ఇమామ్, మౌజన్‌లకు ఖాతాలలో వేసిన నగదును అందజేశారు. ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్‌బాషా మాట్లాడుతూ గత ప్రభుత్వం వదిలేసిన బకాయిలను కూడా విడుదల చేసి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతుందన్నారు. మౌజన్‌లకు రూ.90 కోట్లు నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ సులేమాన్, కరిముల్లా, ఇబ్రహీం, ఖాసీం, సలీం, బహదూర్ బాషా, జానీ, సాహెబ్, గౌస్ జాని తదితరులు పాల్గొన్నారు.

జగన్ బలప్రదర్శన వైసీపీ అంతానికి సంకేతం : కొల్లా

బాపట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జగన్ న్యాయస్థానానికి హాజరయ్యే సమయంలో కూడా వైసీపీ అరాచకశక్తులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు బలగాలను తోసి వేసి బారికేడ్‌లు పడగొట్టి బలప్రదర్శనకు దిగటం వారి నీచసంస్కృతికి నిదర్శనమని సంగం డెయిరీ మాజీచైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. జగన్ నాంపల్లికోర్టుకు హాజరయ్యే సమయంలో పార్టీశ్రేణులు 2029లో కాబోయే సీఎం జగన్ అంటూ నినాదాలు చేయటమే కాకుండా ట్రాఫిక్‌కు అడ్డంకులు కల్పించటం వైసీపీ అరాచక సంస్కృతికి నిదర్శనమన్నారు.

విజయవంతంగా ముగిసిన సాగర్ కవాచ్

బాపట్ల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక మెరైన్ పోలీసు ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాగర్ కవాచ్ ఆపరేషన్ విజయవంతంగా పూర్తయిందని బాపట్ల మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. సాగర్ కవాచ్ ఆపరేషన్‌లో భాగంగా శుక్రవారం ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్, హరితా రిసార్ట్స్, పాతబస్టాండ్‌ల వద్ద డమ్మీబాంబ్ ఆపరేషన్స్ నిర్వహించి రెడ్‌ఫోర్స్ సభ్యులను మెరైన్ పోలీసు నియంత్రణలోకి తీసుకోవటం జరిగిందన్నారు. ఈ ఆపరేషన్‌కు బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, బాపట్ల రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు నాగశివారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

బాపట్ల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఎవరైనా బహిరంగంగా మద్యం సేవించే యత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజ్ అన్నారు. స్టువర్టుపురం చివరి ప్రాంతంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని శుక్రవారం అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించారు.

కర్లపాలెం పంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా వసంతరెడ్డి

కర్లపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా తనను శుక్రవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ నియమించినట్లు పిట్ల వసంతరెడ్డి తెలిపారు. అలాగే పంచాయతీ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినట్లు పఠాన్ ఖాజా మొహిద్దీన్‌ఖాన్‌ను తెలిపారు.

బైక్ కవర్‌లోని లక్షన్నర చోరీ

చెరుకుపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలతో బురిడీ కొట్టించి లక్షన్నర నగదు చోరీ చేసిన సంఘటన శుక్రవారం గుళ్ళపల్లిలో జరిగింది. మండలంలోని తూర్పుపాలెం గ్రామానికి చెందిన పూషడపు నారాయణరావు గుళ్ళపల్లిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి లక్షన్నర నగదు తీసుకుని తన బైక్‌కవర్లో పెట్టుకుని బయలుదేరబోగా ఇద్దరు యువకులు వచ్చి మీడబ్బులు పడిపోయాయని చెప్పడంతో ఆయన బండిదిగి వారు చెప్పిన వైపునకు వెళ్ళగానే వాళ్ళు బైక్ కవర్‌లోని నగదు తీసుకుని ఉడాయించారు. దీనిపై ఆయన చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బస్సు నుంచి జారిపడి వృద్ధురాలికి గాయాలు

చెరుకుపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : బస్సులో నుంచి పడి వృద్ధురాలు తీవ్రగాయాలపాలైన సంఘటన శుక్రవారం చెరుకుపల్లిలో జరిగింది. గోవాడకి చెందిన దావులూరి నరసమ్మ బస్సు ఎక్కింది. ఆమె భర్త ఏదో పని మీద కిందనే ఉండిపోయాడు. ఇంతలో బస్సు బయలుదేరడంతో భర్త బస్సు ఎక్కలేదనే కంగారులో ఆమె హఠాత్తుగా బస్సు దిగడంతో అదుపుతప్పి పడిపోయి బస్సుటైర్‌లు ఆమె ఎడమపాదం పైకి ఎక్కడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను అంబులెన్స్‌లో తెనాలి గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు.

సంపద సృష్టి కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తాం : ఎంపీడీవో

నగరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మంత్రిపాలెంలో సంపద సృష్టి కేంద్రాన్ని త్వరలో అందుబాటులోకి తెస్తామని మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. మంత్రిపాలెంలో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా ఏర్పాటు చేసిన సంపద సృష్టికేంద్రం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన మంత్రిపాలెం సంపద సృష్టి కేంద్రాన్ని సర్పంచ్ సహకారంతో పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సమ్మెత జానకి, సర్పంచ్ మల్లంపాటి ప్రమీల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం సహించం : ఎంపీడీవో

వేమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ, సచివాలయాల పరిధిలో పని చేసే ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం చూపితే సహించేది లేదని ఎంపీడీవో పెద్దింటి రవికుమార్ అన్నారు. ఆయన శుక్రవారం వేమూరు గ్రామ పంచాయతీలోని రెండు సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వపరంగా ఇచ్చిన సర్వేలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. పారిశుధ్య చర్యల విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని గ్రామంలో ఎప్పటికప్పుడు పరిశుభ్ర వాతావరణం కనబడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పలు కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖలు సమిష్టిగా పని చేయాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి నవరాణి పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాన్ని సందర్శించిన డీఎస్‌వో

చెరుకుపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గూడవల్లిలోని రైతుసేవాకేంద్రంలో నూతనంగా ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పౌరసరఫరాల శాఖాధికారి రోషన్‌జమీర్‌బాష సందర్శించారు ఈసందర్భంగా ఆయన ఆన్‌లైన్ విధానంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ఎటువంటి అక్రమాలు చోటుచేసుకోకుండా చూస్తామన్నారు. ఈకార్యక్రమంలో మండల తహశీల్దార్ సిహెచ్ పద్మావతి, మండల వ్యవసాయ అధికారి ఎండీఫారూఖ్, గూడవల్లి పీఏసీఎస్ చైర్మన్ ఆలపాటి నరేంద్రబాబు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు సంగం డెయిరీ వెన్నెముక : డైరెక్టర్

నగరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాడిపరిశ్రమకు సంగం డెయిరీ వెన్నెముక లాంటిదని, పాడి పరిశ్రమ అభివృద్ధికి సంగం డెయిరీ నిరంతరం కట్టుబడి ఉందని సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్ అన్నారు. ధూళిపూడిలో యానిమల్ వెల్ఫేర్ కార్యక్రమంలో పలువురికి శుక్రవారం చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఉయ్యూరు వెంకటేశ్వరరావుకే రూ.45 వేలు, కాటూరు శివనాగేశ్వరరావుకు రూ.55 వేల నగదు చెక్కులను అందించారు. బాపట్ల జోనల్ మేనేజర్ టి.వీరేంద్రకుమార్, వెటర్నరీ డాక్టర్ దినేష్, ఓలేరు బీఎంసీ ఇన్‌చార్జ్ ఎం.హరికృష్ణ, ఫీల్డ్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అమలు చేయ్యొద్దు : సీపీఎం

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం అమలు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసిందని, దీనిని వెంటనే ఆపి వేయాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్ పాల్గొని మాట్లాడుతూ, అఖిల పక్షం సమావేశం నిర్వహించకుండా ఈ ప్రక్రియను చేపట్టడం ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు వ్యతిరేకించాలన్నారు. భట్టిప్రోలులో ధాన్యం కొనుగోలు కేంద్రం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తుఫాన్ వచ్చి నెల రోజులు అవుతున్నా నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు పరిహారం అందలేదన్నారు. దెబ్బతిన్న పంటల స్థానంలో మళ్లీ పంటలు వేసేందుకు రైతులకు ఉచితంగా మొక్కజొన్న విత్తనాలు సరఫరా చేయాలన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి మనోజ్ కుమార్, సభ్యులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ల నాగరాజు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో పోలి పాడ్యమి


జంపని చెన్నకేశవస్వామి వారికి మహాహారతి సమర్పిస్తున్న అర్చకులు

వేమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాస దీక్ష పూజలకు శుక్రవారం పోలి పాడ్యమి పూజలతో ఉద్వాసన పలికారు. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారుజామున నదులు, కాల్వల వద్ద స్నానాలు చేసి అరటి దొప్పలతో దీపాలు వెలిగించి పోలి స్వర్గ పూజలు చేసి ఆ దీపాలను నీటిలో వదిలారు. అనంతరం శివ, విష్ణు ఆలయాలను సందర్శించి చివరి రోజుగా విశేషంగా ఆవునేతి దీపారాధనలు చేశారు. ఆలయాలలో అర్చకులు స్వామివార్లకు అభిషేకాల అనంతరం అలంకరణలు చేసి ఉద్వాసన పూజ జరిపిన తరువాత మహాహారతి సమర్పించి భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.


మహిళల నుంచి అర్జీలు స్వీకరించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. భట్టిప్రోలులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు నియోజకవర్గంలో ప్రతివారం ఒక మండలాన్ని ఎంపిక చేసుకుని ప్రతి శుక్రవారం మండల గ్రామాల ప్రజల సమస్యలు వేదిక ద్వారా పరిష్కారం చూపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటరమణ, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, జడ్పీటీసీ టి.ఉదయభాస్కరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోటూరు పుణ్యశ్రీనివాసకుమార్, భట్టిప్రోలు, సూరేపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు పరుచూరి రమేష్, గోవర్ధనగిరి సుధాకర్, డీసీ అధ్యక్షులు యర్రంశెట్టి కరుణశ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు వాకా శేషుబాబు, వేములపల్లి జగన్నాధరావు, నూతక్కి దినకర్‌బాబు, డి.శ్రీనివాసరావు, యడ్ల జయశీలరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించిన సీపీఎం నాయకులు

మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.మనోజ్‌కుమార్ పలు సమస్యలు ఎమ్మెల్యే వివరించారు. మండల కేంద్రంలో పేద విద్యార్థులకు అవసరమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ఐటిఐలు లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. బౌద్ధ స్థూపం అభివృద్ధికి నిధులు కేటాయించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎం.సత్యనారాయణ, గోళ్ల నాగరాజు, బసవయ్య పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

● మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నిజాంపట్నం తుఫాన్ భవనంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం పీఎంఎంఎస్‌వై రూ.20,32,000 చెక్కు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గంగపుత్రుల అభివృద్ధికి మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ మత్స్యకారులకు సబ్సిడీతో వలలు, మత్స్య సంపద రవాణాకు అనుకూలంగా వారికి కావాల్సిన సదుపాయాలను సమకూర్చటంతోపాటు డీజిల్ సబ్సిడీని అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నారన్నారు. డీఆర్వో జీ.గంగాధర్ మాట్లాడుతూ మత్స్యకారులకు కావాల్సిన రాయితీలను ప్రభుత్వం అందిస్తూ వారికి అండగా నిలుస్తుందన్నారు. కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం(పీఎంఎంఎస్‌వై) ద్వారా జిల్లాలో 11 మత్స్యకార సంఘాలకు యాజమాన్యం ఖర్చుల నిమిత్తం మంజూరు చేసిన చెక్కును అందివ్వటం జరిగిందన్నారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ మాట్లాడుతూ క్రాప్ హ్యార్చరీ నిర్మాణం కోసం అనుమతి పత్రాలను అందివ్వటంతోపాటు 15 మంది మత్స్యకారులకు కేసీసీ కార్డులను అందజేశారని తెలిపారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ చైర్మన్ చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ మత్స్యకారులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు అనంత నవీన్, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మోపిదేవి హరనాథబాబు, బోటు అసోసియేషన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, మత్స్యకార జిల్లా అధికారి కె.శ్రీనివాస్‌నాయక్, డీడీ గాలిదేవుడు, ఎఫ్‌డీవో టి.కిషోర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి పాల్గొన్నారు.


మత్స్యకారులకు చెక్కును అందిస్తున్న అనగాని శివప్రసాద్, డీఆర్వో గంగాధర్

యువత ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యువత ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.మాధవి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ జాబ్‌మేళా పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో జరగనున్న మెగా జాబ్ మేళాలో హెటిరో ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ క్లౌడ్ టెక్నాలజీ, రెడ్డిస్ ఫౌండేషన్, హీరోమోటార్స్, టెక్‌లింక్స్ ఇన్నోవేషన్ లాంటి ప్రముఖ 17 కంపెనీలు పాల్గొననున్నాయని తెలిపారు. ఈ కంపెనీల ద్వారా మొత్తం 890 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9032384374 నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

జీడీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోలుకు చర్యలు

వేమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లోని రైతులు నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు జీడీసీఎంఎస్ ద్వారా వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు సహకరించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ సుశీల అన్నారు. ఆమె యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు , మూడు రోజుల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. తొలిగా వేమూరు కేంద్రం పరిధిలో చావలి, బలిజేపల్లి, చంపాడు, జంపని, వేమూరు గ్రామాల పరిధిలోని రైతులకు విడుదల చేసిన షెడ్యూల్ ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ ఫణికుమార్, వీఆర్వో జితేంద్ర, ఏవో ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజం ఏర్పాటుకు తోడ్పడుదాం

చుండూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమాజాన్ని మరింత ఉన్నంతగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరి తోడ్పాటు అవసరమని మై చాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లాంప్ సంస్థ శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు అన్నారు. వేటపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సంస్థ ప్రతినిధి కొండపల్లి వెంకటేశ్వరరావు, హెచ్ఎం అంకమ్మరావు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎల్.నాగమల్లేశ్వరి, పద్మావతి, అన్నపూర్ణ, సౌభాగ్యం, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన ఇంజనీరింగ్ అధికారులు

చుండూరు-పెదగాదెలవర్రు మధ్య రూ.1.50 కోట్ల నాబార్డు నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. నాణ్యత టెస్ట్‌లు సరి చూశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరయ్య చౌదరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీఎస్ఎస్ రెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, జేఈ రజనీకాంత్, ఏఈ మరియదాసు తదితరులు పర్యవేక్షించారు.

కళ్లకు కట్టిన మంద పోరు..

- వేడుకగా పల్నాటి వీరారాధన ఉత్సవాలు
- నాగులేటిలో వీరాచారవంతుల కొణతాలకు స్నానం
- కులమతాలకు అతీతంగా చాపకూడు
- సహపంక్తి భోజనం చేసిన కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు



గ్రామోత్సవంలో కొణతములు



కన్నమదాసు ఖడ్గాన్ని చేతబూనిన కలెక్టర్ కృత్తికా శుక్లా

కారంపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో మూడో రోజు శుక్రవారం మందపోరు, చాపకూడు కార్యక్రమం వీర్ల దేవాలయంలోని చాపకూడు మందిరంలో నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులు తమ కొణతములకు నాగులేటిలోని గంగధార మడుగులో స్నానమాచరింపజేసి అలంకరించారు. మహిళలు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి వెంట పొంగళ్లతో వీర్ల దేవాలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా బయలుదేరి చెన్నకేశవస్వామి, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించారు. బ్రహ్మానాయుడు విగ్రహం, పీఠాధిపతి నివాసం వద్ద కత్తిసేవ చేశారు. మహిళా వీరాచారవంతులు అంకమ్మ పెట్టెలతో తరలివచ్చారు. అందరూ ఊరేగింపుగా అంకాళమ్మ ఆలయానికి పూర్వీకుల ఆయుధాలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకాళమ్మ అమ్మవారికి కొలుపులు చేశారు. అంకమ్మ పెట్టెలతో అమ్మవారికి సంబంధించిన వస్తువులు, గాజులు, ఫొటో, కుంకుమ తదితర సామగ్రితో తరలివచ్చారు. రాత్రివేళ పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారును ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా వీర్ల దేవాలయం వద్దకు తీసుకొని వచ్చారు. అక్కడ రాచగావు మండపంలో బ్రహ్మనాయుడు స్థానంలో పీఠాధిపతి ఆశీనులు కాగా వీర విద్యావంతులు మందపోరు కథను గానం చేశారు. ఆవుల మందకు కాపలాగా ఉన్న గోపన్నను నాగమ్మ సైన్యం హతమార్చడం ఘటనను ఆలపించారు. ఆవుల మందను ముట్టడించడమే మందపోరుగా మూడో రోజున నిర్వహించారు. పీఠం నిర్వాహకులు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులకు కంకణ ధారణ చేశారు. మందపోరు ఘట్టాన్ని విజయవంతంగా ముగించారు.

కులమతాలకు అతీతంగా చాపకూడు

బ్రహ్మనాయుడు ఆశించిన సర్వమత సమ్మేళనంలో భాగంగా వీరారాధన ఉత్సవాల్లో మూడో రోజున మంద పోరులో భాగంగా వీర్ల దేవాలయ ఆవరణలో చాపకూడు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహపంక్తి భోజనం చేశారు. జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా అన్నపురాసుల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. 900 ఏళ్ల క్రితమే కులమతాలకు అతీతంగా చాపకూడును పల్నాటి బ్రహ్మనాయుడు నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు, ఎస్పీ కృష్ణారావు, గురజాల డీఎస్పీ జగదీష్, ఆర్డీవో మురళీకృష్ణలు సహపంక్తి భోజనం చేశారు. వీరుల దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మనాయుడు నృసింహకుంతాన్ని చేబూనారు. కన్నమదాసు ఖడ్గాన్ని కలెక్టర్ కృత్తికా శుక్లా చేబూనారు. ముందుగా ఉత్సవాలకు విచ్చేసిన ప్రజాప్రతినిధులకు కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంగులూరి అంజయ్య, వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, బొల్నేడి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, మనుగోటి సత్యం, చప్పిడి రాము, ఉన్నం లక్ష్మీనారాయణ, సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలునాయక్, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జాని, ఎస్‌పీఆర్ కృష్ణ, పూర్ణయ్య, కర్నాటి మహేష్ పాల్గొన్నారు.

నేడు కోడిపోరు

పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన శనివారం ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కోడిపోరును నిర్వహించనున్నారు. పల్నాటి యుద్ధానికి ప్రధాన కారణమైన కోడి పందెలను కోడిపోరు పేరుతో వీర్ల దేవాలయ ప్రాంగణంలో జరపనున్నారు. ఈ పోరును వీక్షించేందుకు వేలాదిగా ప్రజలు తరలిరానున్నారు.

బ్రహ్మనాయుడి ఆశయాలను కొనసాగిద్దాం

కులమతాలకు అతీతంగా బ్రహ్మనాయుడు ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మాల వర్గీయుడు కన్నమదాసును సర్వ సైన్యాధ్యక్షునిగా బ్రహ్మనాయుడు చేశారన్నారు. బ్రహ్మనాయుడు మానవతావాది, సాంఘిక విప్లవవాదన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటికీ అమలవుతున్నాయన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు మాట్లాడుతూ వీరులకు పూజలు చేయడం రోమ్ నగరంలో ఉందని, తరువాత కారంపూడిలో మాత్రమే ఉందన్నారు.



పొంగళ్లతో మహిళలు, ఎమ్మెల్యే జూలకంటి



కన్నమదాసు విగ్రహం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు



చాపకూడు మంటపంలో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

అంత..వేడల్పా..!?

(5వ పేజీ తరువాయి)

చేయాలని కోరింది. ఆ మేరకు సర్వే నంబర్ల వారీగా రెవెన్యూ అధికారులు భూసేకరణ ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక ఓఆర్ఆర్ కోసం 250 మీటర్ల వెడల్పుతో 190 కిలోమీటర్ల పొడవునా భూసేకరణ చేపట్టాలని నిర్ణయించడంపై భూములు కోల్పోయే రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో ఆగ్రహం..

ఓఆర్ఆర్ ఫైనల్ డీపీఆర్‌ని కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు కొన్ని నెలల క్రితం పంపించారు. అందులో 140 మీటర్ల వెడల్పునకు పరిమితమై భూసేకరణ చేపడతామన్నారు. ప్రాజెక్టు ఖర్చు రూ. 24,791 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం కూడా తెలిపారు. భూసేకరణకు అయ్యే ఖర్చు రూ.3,117 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే తన వాటాగా భరించేందుకు అంగీకారం తెలిపింది. దీనిపై రైతులు పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఎప్పుడైతే ఎవరి అభిప్రాయాలను తీసుకోకుండా భూసేకరణని 250 మీటర్ల వెడల్పునకు నిర్ణయించి కలెక్టరేట్‌లకు ప్రతిపాదనలు పంపించారో అప్పటి నుంచి రైతులు ఆగ్రహం వెల్లుబుకుతోంది. అంత వెడల్పుతో భూసేకరణ చేపడితే తాము భూములను సింహభాగం కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అంత పెద్ద హైదరాబాద్ ఓఆర్ఆర్‌నే 150 మీటర్ల వెడల్పుతో నిర్మించారు. అందులో ఎనిమిది వరసల రహదారి, మీడియన్, ఇరువైపులా సర్వీసు రోడ్లు, గ్రీన్ స్పేసెస్ ఉన్నాయి. దాని కంటే అదనంగా మరో 100 మీటర్ల వెడల్పుతో అమరావతి ఓఆర్ఆర్ భూసేకరణ చేపట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.



భూసేకరణకు ఖర్చు రెట్టింపు

అమరావతి ఓఆర్ఆర్ కోసం ఎన్‌టీఆర్ జిల్లాలోని 4 మండలాల్లో 18 గ్రామాల్లో 51.120 కిలోమీటర్లు, ఏలూరులో ఒక మండలంలోని 8 గ్రామాల్లో 18.760 కిలోమీటర్లు, కృష్ణ జిల్లాలో ఐదు మండలాల్లోని 22 గ్రామాల్లో 35.140 కిలోమీటర్లు, గుంటూరు జిల్లాలోని 11 మండలాల్లో 40 గ్రామాల్లో 67.650 కిలోమీటర్లు, పల్నాడు జిల్లాలో 2 మండలాల్లో 9 గ్రామాల్లో 17.230 కిలోమీటర్ల పొడవునా నిర్మించేందుకు ఎలైన్‌మెంట్ చేశారు. ఓఆర్ఆర్‌కి లింకుగా మరో రెండు రోడ్లను కూడా 19.300 కిలోమీటర్లతో నిర్మించనున్నారు. పెరిగిన వెడల్పు ప్రకారం భూసేకరణకే రూ.5 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని అంచనా. పైగా పెంచిన వెడల్పు కారణంగా పలు పరిశ్రమలు, నివాసిత ప్రాంతాలను కూడా తొలగించాల్సి ఉంటుంది. వాటికి నష్టపరిహారం రూపంలో అదనంగా ఖర్చు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం నాలుగు నెలల క్రితం అమరావతి ఓఆర్ఆర్‌ని ఆరు వరసలు, ఇరువైపులా సర్వీసు రోడ్లకు మాత్రమే ఆమోదం తెలిపింది. అప్పుడు 140 మీటర్ల వెడల్పునకే ప్రతిపాదించింది. ఇప్పుడు 250 మీటర్లు అంటే ఆ వెడల్పులో భూమిని తీసుకొని ఏ అవసరాలకు రిజర్వు చేసి పెట్టుకొంటారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

యూరియా బస్తా... రూ.500

(5వ పేజీ తరువాయి)

వాడుతున్నట్లు వ్యవసాయ శాఖ ఎప్పుడో గుర్తించింది. పల్నాడు ప్రాంతంలో మిరప రైతులు కూడా యూరియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ముందుగానే కొనుగోలు చేస్తున్నారు. మాచర్లలో యూరియా రూ.420 నుంచి రూ.460కి తక్కువ అమ్మే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో చాలాచోట్ల రూ.450 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నారు. కొందరు రైతుల పేరుతో కొందరు, పలుకుబడి ఉపయోగించి మరికొందరు ముందుగానే కొనుగోలు చేసి వాటినే రైతులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

మేలుకోకపోతే ముప్పే..

ఖరీఫ్‌లో కేటాయింపులకు మించి ప్రభుత్వం యూరియాను సరఫరా చేసింది. అయినా కొరత ఉన్నట్లు ప్రచారం జరిగింది. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు వెళ్లిన వందల టన్నుల యూరియా కొందరికి మాత్రమే పంచేయడంతో వాస్తవ రైతులు కొరతతో ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో రబీలో ఎలా ఉంటుందోనన్న దానిపై సందిగ్ధం ఏర్పడుతుంది. వాస్తవానికి రబీలో గుంటూరు జిల్లాకు 55840 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం అవుతుంది. కానీ నిల్వలు ఆ మేరకు వస్తాయా లేదా అన్న దానిపై అనుమానం నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వం నిల్వల్లో 70 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీ లకు, 30 శాతం డీలర్లకు కేటాయిస్తుంది. లింక్ ఉత్పత్తులు తీసుకుంటేనే యూరియా ఇస్తామని డీలర్లు చెబుతున్నాయి.

అక్షరం అండగా.. సమస్యలు పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

గాయత్రినగర్, కొట్నాల్చ వీధివాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల సమస్యల ఆంధ్రజ్యోతి ద్వారా పరిష్కారం అయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. గాయత్రినగర్ కాల్వ కట్ట మొదటి వీధిలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని మహిళలు కోరగా రూ.45 లక్షలతో నిర్మించారు. ఈ పనులకు జీవీ శుక్రవారం ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి వేదికగా సమస్యలు పరిష్కారం : జీవీ

కొట్నాల్చవీధి, గాయత్రినగర్‌లో రెండు నెలల్లో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించడం ఇది అక్షర విజయమని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆంధ్రజ్యోతి - ఏబీఎన్‌ను కొనియాడారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో రూ.63.60 లక్షలతో ప్రజలు కోరినట్లు రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా ఆంధ్రజ్యోతి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో అభినందనీయమన్నారు. అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ప్రజాసమస్యలు తీసుకెళ్లి పరిష్కరించగలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. వినుకొండలో ఆంధ్రజ్యోతి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు విని, పరిశీలించి రెండు నెలల్లో పరిష్కారించామన్నారు. ఇటువంటి కార్యక్రమాలను భవిష్యత్‌లో ఆంధ్రజ్యోతి నిర్వహించాలని కోరారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చే సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



రూ.210 కోట్లతో తాగునీటి పథకం విస్తరణ

వినుకొండలో రూ.210 కోట్లతో తాగునీటి పథకం విస్తరణ చేపట్టినట్లు జీవీ తెలిపారు. 2018లో టీడీపీ పాలనలో నీటి పథకానికి నిధులు విడుదల చేస్తే వైసీపీ హయాంలో వదిలేశారన్నారు. ఇప్పుడు మళ్లీ తాము అధికారంలోకి వచ్చాక పనులను పట్టాలెక్కించామన్నారు. నీటి పథకాన్ని త్వరతగతిన పూర్తి చేసి వినుకొండలో ఇంటింటికి మంచినీరు అందిస్తామన్నారు. రెండేళ్లలో పనులు పూర్తి చేసి ఇంటింటికి తాగునీరు అందించడమే జీవిత ఆశయమన్నారు. వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారంలో భాగంగా ప్రధాన కాల్వను నిర్మిస్తున్నామన్నారు. రూ.18 కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంట్లును త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో 20 వేల టన్నుల వ్యర్థాలు వదిలేస్తే తాము శుభ్రం చేశామన్నారు. ఐదేళ్లలో ఎన్ఎస్‌పీ కాలనీలో ఒక్క ఇటుక పెట్టలేదని, తాము అభివృద్ధి చేస్తామన్నారు. వినుకొండ ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కు నిర్మాణం చేపడతామన్నారు. క్రీడాభివృద్ధి కోసం స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. పల్లెల్లో కూడా ప్రతి ఇంటికి రక్షిత నీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు వాసిరెడ్డి లింగమూర్తి, షకీలా దస్తగిరి, ఏఈ ఆదినారాయణ, మాజీ చైర్మన్ షమీంఖాన్, బొల్లేపల్లి వెంకట్రావు, బోడపాటి రామారావు, కొల్లి శేఖర్, పెమ్మసాని నాగేశ్వరరావు, సౌదాగర్ జానీ, పీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చీఫ్‌విప్ జీవీని సత్కరిస్తున్న గాయత్రి నగర్ వాసులు



ఏళ్ల నాటి సమస్య పరిష్కారం

గాయత్రినగర్‌లో ఏళ్ల తరబడి రోడ్ల సమస్య ఉంది. అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కమిషనర్‌ను ఒక వేదికపైకి తీసుకు వచ్చింది. తమ సమస్యలను నేరుగా చెప్పుకునేలా చొరవ చూపింది. గాయత్రినగర్‌లో రహదారులు నిర్మించాలని కోరగా సీసీ రోడ్లు నిర్మించారు. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్‌కు కృతజ్ఞతలు.

-వాసిరెడ్డి లింగమూర్తి, కౌన్సిలర్

వినూత్న కార్యక్రమం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ వినూత్న కార్యక్రమం నిర్వహించింది. గాయత్రినగర్, 23 వార్డులో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న రోడ్లు, మురుగుకాల్వ సమస్యలను మా దృష్టికి తీసుకువచ్చింది. చీఫ్‌విప్ ఆదేశాలతో రోడ్లను నిర్మాణం చేశాం. ప్రజల సమస్యలను త్వరతగతిన పరిష్కరించేందుకు ఆంధ్రజ్యోతి దోహదపడింది.

-సుభాష్ చంద్రబోస్, కమిషనర్





రోడ్ల సమస్య పరిష్కారం

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ వినూత్న కార్యక్రమం ద్వారా రోడ్ల సమస్యలు పరిష్కారమయ్యాయి. గాయత్రినగర్, కొట్నాల్చ వీధిలో సీసీ రోడ్లు నిర్మించారు. ప్రజల సమస్యలను అధికారులు, కౌన్సిలర్లు, చీఫ్‌విప్ జీవీ దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి ఆంధ్రజ్యోతి వారధిగా వ్యవహరించింది.

-షేక్ షకీలా బేగందస్తగిరి, కౌన్సిలర్

ప్రభుత్వ సర్వీసుల్లో చేరగానే.. డాక్టర్లలో నిర్లిప్తత!

- అర్థం లేని నిబంధనలతో ప్రజలకు ఇబ్బందులు: హైకోర్టు
- శ్యామల మానసిక వైకల్యాన్ని నిర్ధారించారు..
- ఆమె శారీరక వైకల్యాన్ని పట్టించుకోరా?
- డాక్టర్ల బృందాన్ని ఆమె నివాసానికే పంపండి
- వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు న్యాయమూర్తి ఆదేశం
- తదుపరి విచారణ డిసెంబరు 1కి వాయిదా

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన సెల్లూరి శేషగిరమ్మ మనవరాలు శ్యామలకు మానసిక వైకల్యం ఉందని నిర్ధారించిన ప్రభుత్వ డాక్టర్లు.. ఆమె శారీరక వైకల్యాన్ని పట్టించుకోకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ప్రభుత్వ డాక్టర్ల వైఖరిని తీవ్రంగా తప్పుపట్టింది. మానసిక వైకల్యంతో బాధపడుతున్న శ్యామలకు సదరమ్ సర్టిఫికెట్ కోసం ఆమె కుటుంబ సభ్యులు దరఖాస్తు చేశారని.. ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించి 95 శాతం మానసిక వైకల్యంతో బాధపడుతున్నట్లు డాక్టర్లు నిర్ధారించారని గుర్తు చేసింది. మనిషిని చూసి శారీరక స్థితిని అంచనా వేయవచ్చని.. శ్యామల కనీసం నడవలేని స్థితిలో ఉన్నా డాక్టర్లు ఆ విషయాన్ని విస్మరించడం ఏమిటని ప్రశ్నించింది. ప్రభుత్వ సర్వీసుల్లో చేరగానే డాక్టర్లను నిర్లిప్తత ఆవహిస్తోందని, అర్థంలేని నిబంధనలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేసింది. ప్రజలకు సేవ చేయడానికి వారు ఉన్నారనే విషయం మరచిపోతున్నారని వ్యాఖ్యానించింది. శ్యామల బహుళ వైకల్యంతో బాధపడుతున్నట్లు డాక్టర్లకు తాము చెప్పాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొంది. ఆమెకు ఏమేర శారీరక వైకల్యం ఉందో అంచనా వేసి.. వారం రోజుల్లో నివేదికను కోర్టు ముందు ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఇందుకు నిపుణులైన డాక్టర్ల బృందాన్ని శ్యామల నివాసానికే పంపించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను డిసెంబరు 1కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ప్రకాశం బ్యారేజి గేట్లు మూసివేత

తాడేపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల నిలిపివేయడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి తగ్గింది. ఎగువ నుండి 7703 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా బ్యారేజి గేట్లు అన్ని మూసివేసి దిగువకు ఔట్‌ఫ్లో నిలిపివేశారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 2919 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 271 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేయాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

తాడేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు పూర్వ ప్రాథమిక పాఠశాలల పనితీరును మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలోని 3, 7 అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న తక్కువ బరువున్న పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని రాయపాటి శైలజ సీడీపీవోను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలలో పని చేస్తున్న సిబ్బంది, తల్లులతో ఆమె మాట్లాడారు. చిన్నారులను పలు ప్రశ్నలు వేశారు. డాక్టర్ శైలజ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో వుంటే చిన్నారుల బరువు, ఎత్తును ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. తక్కువ బరువున్న పిల్లలను గుర్తించి న్యూట్రిషన్ రీసోర్స్ సెంటర్స్‌లో 15 రోజులపాటు ఉంచి మంచి పౌష్టికాహారం అందించి వారి బరువు పెరిగే విధంగా చూడాలని సూచించారు. దానికి వారి తల్లులు, ఆయా కేంద్రాలకు వెళ్లే విధంగా అవగాహన కల్పించాలన్నారు. స్కూలుకు వెళ్లే చిన్నారులకు హెచ్‌బి టెస్ట్ చేయించి రక్తహీనత ఉన్న చిన్నారులకు ఐరన్ సప్లిమెంట్ ఇవ్వాల్సి వుంటుందన్నారు. ఎఎన్ఎంలతో ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. స్కూలుకు వెళ్లని పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలకు వెళ్లేలా చూడాలన్నారు. తల్లి బిడ్డలందరిని ఒక చోట కూర్చోబెట్టి బాలామృతం, పాలు, గుడ్లు తదితర పౌష్టికాహారం ప్లిలలకు పెట్టే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆమె చిన్న చిన్న కథలపై చిన్నారులకు పలు ప్రశ్నలు వేసి వారి సమాధానాలతో ముచ్చటపడ్డారు. రోజువారీ అటెండెన్స్‌ను తనిఖీ చేశారు. టాయ్‌లెట్స్ నీట్‌గా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ అడ్వయిజర్ రావూరి సూయిజ్, సెక్షన్ ఆఫీసర్ శైలజ, మంగళగిరి సీడీపీవో సరిత, ఏసీడీపీవో సౌమ్య, అంగన్‌వాడీకార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



చిన్నారులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రాయపాటి శైలజ

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్..

కొల్లిపర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్‌లను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కోటేశ్వరరావు వివరాల మేరకు.. మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి ఇసుక రీచ్‌లను ఎస్ఐ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మున్నంగి గ్రామానికి చెందిన నాలుగు ఇసుక ట్రాక్టర్లలో ఇసుకను ఎటువంటి బిల్లులు లేకుండా తీసకెళ్లడం గుర్తించారు. కుంచవరం సమీపంలో ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కొల్లిపర మండలం వరకు మాత్రమే ఉచిత ఇసుక అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్‌కు రూ.10 వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండవ సారీ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే రూ.20వేలు వరకు జరిమనా విధించడంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు..



సీఎం చంద్రబాబును ఆహ్వానిస్తున్న ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఇతర అధికారులు

ఎలక్ట్రిక్ టగ్ బిల్డింగ్ శంకుస్థాపనకు సీఎంకు ఆహ్వానం

● మారిటైంబోర్డు ఆధ్వర్యాన త్వరలో కాకినాడలో రూ.80 కోట్లతో నిర్మాణం

కొండపి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ మారిటైంబోర్డు ఆధ్వర్యంలో కాకినాడలో రూ.80 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న ఎలక్ట్రిక్ టగ్ భవన శంకుస్థాపన కార్యక్రమానికి ఈనెల 29న రావాలని ఆహ్వానిస్తూ సీఎం నారా చంద్రబాబునాయుడిని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య, శాన్‌మారిటైం ఇండియా షిప్ బిల్డింగ్ కంపెనీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ఎస్‌కె.అహ్మద్ ఆలీషా శుక్రవారం రాత్రి కలిసి ఆహ్వానించారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధనలో భాగంగా, మేకిన్ ఇండియా పాలసీలో భాగంగా దేశంలోనే తొలిసారిగా కాకినాడ పోర్టు వద్ద కంపెనీ ఏర్పాటు చేయడం ద్వారా పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ నౌకల తయారీని అందుబాటులోకి తేనున్నారు. ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగావకాశాలు లక్ష్యంగా ఈ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారు. నౌకాయాన రంగంలో పర్యావరణ హితమైన, కార్బన్ ఉద్గారాలను తగ్గించే సాంకేతికతతో సాన్ మారిటైమ్ కంపెనీ దేశంలోని ప్రముఖ మెరైన్ డిజైన్ సంస్థలు, సమగ్ర మెరైన్ ఎలక్ట్రిక్ సొల్యూషన్ ప్రొవైడర్లు, ఎలక్ట్రిక్ మొబిలిటీ టెక్నాలజీ సొల్యూషన్ ప్రొవైడర్లతో భాగస్వామ్యం చేసుకుని ఎలక్ట్రిక్ నౌకలను నిర్మించనుందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు సత్య, అహ్మద్ ఆలీషా వివరించారు.

నేడు డ్వాక్రా మహిళలకు మెగా రుణమేళా

● పాల్గొననున్న మంత్రి స్వామి, సత్య

కొండపి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ- వెలుగు ఆధ్వర్యంలో కొండపి, జరుగుమల్లి, మర్రిపూడి మండలాల స్థాయిలో శనివారం ఉదయం స్థానిక కామేపల్లి రోడ్డులోని సాయిసీతారామ కల్యాణమండపంలో డ్వాక్రా మహిళలకు రూ.7 కోట్లకుపైగా మెగా రుణమేళా, యూనిట్లు పంపిణీ కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరుకానున్నారు.

కార్యక్రమానికి దాదాపు వెయ్యి మంది మహిళలు హాజరయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమేరకు శుక్రవారం ఏర్పాట్లను ఎంపీడీవో బి.రామాంజనేయులు, తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం బి.గోపీనాథ్ పరిశీలించారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

● జేసీ గోపాలకృష్ణ ఆదేశం

ఒంగోలు(రూరల్), నవంబరు21(ఆంధ్రజ్యోతి): రైతులు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లర్ల యజమానులు పూర్తిగా సహకరించాలని జేసీ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జిల్లాలోని రైస్ మిల్లర్ల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో రబీసీజన్‌లో 25వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చిందని, దీనిని కొనుగోలుకు గోదాములు సిద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు తరువాత రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో44 రైతు సేవాకేంద్రాలు, 26 సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం వరలక్ష్మి, డీఎస్‌వో పద్మశ్రీ, రైస్‌మిల్లర్స్ సంఘ ప్రతినిధి శ్రీనివాసరావు, మిల్లర్లు పాల్గొన్నారు.

నగర అభివృద్ధి నిధుల కోసం వినతి



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందరన్భంగా నగర అభివృద్ధి కోసం నిధులు అవసరతను తెలియజేశారు. పోతురాజు కాలువ ఆధునికీకరణ, నల్లకాలువ, కొత్తపట్నం బీచ్ రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ జిల్లాలో నియోజకవర్గ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విన్నవించిన ఎమ్మెల్యే ముత్తుముల



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంకు చెందిన పలు సమస్యలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. దీనితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గంలో గత నెలలో బీభత్సం సృష్టించిన మొంథా తుఫాన్ వలన గిద్దలూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో పలు చెరువులు, రోడ్ల మరమ్మతులకు గురయ్యాయని, వాటి కోసం అత్యవసర నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 4,379 రైతులకు సంబంధించి 1,844.21 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

పశు పోషకులకు దాణా పంపిణీ

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ల, ఈదర పశు వైద్యశాలలోని పశు పోషకులకు 50 శాతం సబ్సిడీపై మంజూరైన దాణాను శుక్రవారం సాయంత్రం మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి కాసిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బుర్రి అంజయ్య, ఎంపీటీసీ సభ్యుడు పాలపర్తి సుబ్బారావు, నుంకర రాఘవరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గతుకుల దారులు

● అధ్వానపు రోడ్లపై ప్రయాణించాలంటే ఆందోళన చెందుతున్న వాహన చోదకులు



రాళ్లు తేలిన బల్లికురవ- మార్టూరు రోడ్డు

అద్దంకి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ప్రాంతంలో పలురోడ్లు, వంతెనలు వాహన చోదకులను బెంబేతెత్తిస్తున్నాయి. ప్రధానంగా అద్దంకి-దర్శి ఆర్‌అండ్‌బీ రోడ్డులో గుండ్లకమ్మ నదిపై 4 దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన రెండు దశాబ్దాల క్రితం కుంగింది. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరిం చారు. అయితే ప్రస్తుతం వంతెన పూర్తిగా శిధిలావస్థ కు చేరి గోతులు పడ్డాయి. అద్దంకి- రేణింగవరం రోడ్డులో మూడు చోట్ల ఉన్న లోలెవల్ వంతెనలు శిథిలమయ్యాయి. దశాబ్ద కాలం క్రితం డబుల్ రోడ్డుగా మార్చినా కొత్త వంతెనలు నిర్మాణం జరగ లేదు.. బల్లికురవ- మార్టూరు రోడ్డు రూపురేఖలు కోల్పోయింది. దీంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు.

ప్రయాణం నరకప్రాయం

చీరాల : పట్టణంల మొంథా తుఫాన్ ప్రభావంతో డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో చీరాల ఏరియా వైద్యశాల మార్గంలో రహదారిని పగులకొట్టి కొంత మేరకు డ్రయినేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. అనంతరం కొంత మేరకు రోడ్డును సరిచేసి మిగిలిందంతా అలాగే వదిలేశారు. దీంతో రాకపోకలన్ని రోడ్డుకు ఒకవైపు జరుగుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగకుండా పోలీసులు మాత్రం హోర్డింగ్‌లు ఉంచారు. రోజుల తరబడి ఈ సమస్య పరిష్కారం కాకుండా ఉండిపోయింది. అత్యవసర వైద్యం, సాధారణ వైద్యం కోసం రోగులు, అంబులెన్స్ ద్వారా ఈ మార్గంలోనే ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈక్రమంలో రహదారిని తక్షణమే బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే మండల పరిధిలోని ఆంధ్రకేసరి నగర్ గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మించి సుమారు మూడు దశాబ్దాలు దాటింది. ప్రస్తుతం ఆ మార్గం పూర్తి అధ్వానంగా తయారైంది.

పర్చూరు : గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రహదారుల అభివృద్ధి వైపు కన్నెత్తి చూడకపోవటంతో రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ చూసిన గుంతల మయం కావడంతోపాటు, కంకర రాళ్ళు లేచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీనికి తోడు ఇటీవల వర్షాల నేపథ్యంలో రోడ్లు మరింత దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నారు. పర్చూరు నుండి ఇంకొల్లు వెళ్ళే పాత మద్రాసు రోడ్డు పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డులో ప్రయాణాలు సాగించాలంటే వాహనచోదకులు భయపడుతున్నారు. ఈ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించినా సరైన ప్రమాణాలు పాటించకపోవడంతో సమస్య తీవ్రంగానే ఉంది. ఇక పర్చూరు నుండి జాగర్లమూడి మీదుగా యద్దనపూడి, గన్నవరం, మార్టూరు వెళ్ళే రోడ్డు అత్యతం దయనీయంగా ఉంది. అలాగే పర్చూరు మండల పరిధిలోని బోడవాడ నుండి రమణాయపాలెం మీదుగా జిల్లా కేంద్రం బాపట్లకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు కనీసం మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.





గోతులతో నిండిన బోడవాడ- చెరుకూరు రహదారి, ఆంధ్రకేసరి నగర్‌లో భయానకంగా ప్రధాన రహదారి

అంత...వేడల్పా..!?

(5వ పేజీ తరువాయి)

చేయాలని కోరింది. ఆ మేరకు సర్వే నంబర్ల వారీగా రెవెన్యూ అధికారులు భూసేకరణ ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక ఓఆర్‌ఆర్ కోసం 250 మీటర్ల వెడల్పుతో 190 కిలోమీటర్ల పొడవునా భూసేకరణ చేపట్టాలని నిర్ణయించడంపై భూములు కోల్పోయే రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో ఆగ్రహం..

ఓఆర్‌ఆర్ ఫైనల్ డీపీఆర్‌ని కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు కొన్ని నెలల క్రితం పంపించారు. అందులో 140 మీటర్ల వెడల్పునకు పరిమితమై భూసేకరణ చేపడతామన్నారు. ప్రాజెక్టు ఖర్చు రూ. 24,791 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం కూడా తెలిపారు. భూసేకరణకు అయ్యే ఖర్చు రూ.3,117 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే తన వాటాగా భరించేందుకు అంగీకారం తెలిపిం ది. దీనిపై రైతులు పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఎప్పుడైతే ఎవరి అభిప్రాయాలను తీసుకోకుండా భూ సేకరణని 250 మీటర్ల వెడల్పునకు నిర్ణయించి కలెక్టరేట్‌లకు ప్రతిపాదనలు పంపించారో అప్పటి నుంచి రైతులు ఆగ్రహం పెల్లుబుకుతోంది. అంత వెడల్పుతో భూసేకరణ చేపడితే తాము భూములను సింహభాగం కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అంత పెద్ద హైదరాబాద్ ఓఆర్‌ఆర్‌నే 150 మీటర్ల వెడల్పుతో నిర్మించారు. అందులో ఎనిమిది వరసల రహదారి, మీడియన్, ఇరువైపులా సర్వీసు రోడ్లు, గ్రీన్ స్పేసెస్ ఉన్నాయి. దాని కంటే అదనంగా మరో 100 మీటర్ల వెడల్పుతో అమరావతి ఓఆర్‌ఆర్ భూసేకరణ చేపట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

భూసేకరణకు ఖర్చు రెట్టింపు

అమరావతి ఓఆర్‌ఆర్ కోసం ఎన్‌టీఆర్ జిల్లాలోని 4 మండలాల్లో 18 గ్రామాల్లో 51.120 కిలోమీటర్లు, ఏలూరులో ఒక మండలంలోని 8 గ్రామాల్లో 18.760 కిలోమీటర్లు, కృష్ణ జిల్లాలో ఐదు మండలాల్లోని 22 గ్రామాల్లో 35.140 కిలోమీటర్లు, గుంటూరు జిల్లాలోని 11 మండలాల్లో 40 గ్రామాల్లో 67.650 కిలోమీటర్లు, పల్నాడు జిల్లాలో 2 మండలాల్లో 9 గ్రామాల్లో 17.230 కిలోమీటర్ల పొడవునా నిర్మించేందుకు ఎలైన్‌మెంట్ చేశారు. ఓఆర్‌ఆర్‌కి లింకుగా మరో రెండు రోడ్లను కూడా 19.300 కిలోమీటర్లతో నిర్మించనున్నారు. పెరిగిన వెడల్పు ప్రకారం భూసేకరణకే రూ.5 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని అంచనా. పైగా పెంచిన వెడల్పు కారణంగా పలు పరిశ్రమలు, నివాసిత ప్రాంతాలను కూడా తొలగించాల్సి ఉంటుంది. వాటికి నష్టపరిహారం రూపంలో అదనంగా ఖర్చు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం నాలుగు నెలల క్రితం అమరావతి ఓఆర్‌ఆర్‌ని ఆరు వరసలు, ఇరువైపులా సర్వీసు రోడ్లకు మాత్రమే ఆమోదం తెలిపింది. అప్పుడు 140 మీటర్ల వెడల్పునకే ప్రతిపాదించింది. ఇప్పుడు 250 మీటర్లు అంటే ఆ వెడల్పులో భూమిని తీసుకొని ఏ అవసరాలకు రిజర్వు చేసి పెట్టుకొంటారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అక్షరం అండగా.. సమస్యలు పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

గాయత్రినగర్, కొట్నాల్ప వీధివాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల సమస్యల ఆంధ్రజ్యోతి ద్వారా పరిష్కారం అయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. గాయత్రినగర్ కాల్వకట్ట మొదటి వీధిలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని మహిళలు కోరగా రూ.45 లక్షలతో నిర్మించారు. ఈ పనులకు జీవీ శుక్రవారం ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి వేదికగా పరిష్కారం : జీవీ

కొట్నాల్పవీధి, గాయత్రినగర్‌లో రెండు నెలల్లో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించడం ఇది అక్షర విజయమని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆంధ్రజ్యోతి - ఏబీఎన్‌ను కొనియాడారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో రూ.62.60 లక్షలతో ప్రజలు కోరినట్లు రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా ఆంధ్రజ్యోతి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో అభినందనీయమన్నారు. అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ప్రజాసమస్యలు తీసుకెళ్లి పరిష్కరించగలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. వినుకొండలో ఆంధ్రజ్యోతి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు విని, పరిశీలించి రెండు నెలల్లో పరిష్కారించామన్నారు. ఇటువంటి కార్యక్రమాలను భవిష్యత్‌లో ఆంధ్రజ్యోతి నిర్వహించాలని కోరారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చే సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆర్‌ఎల్‌పురం రహదారిపై ప్రమాదాల పరంపర

● ట్రాలీ క్యాబిన్ ఊడిపోయి కిందపడిన గ్రానైట్ రాళ్లు



రామతీర్థం-ఆర్‌ఎల్ పురంల మధ్య జారి పడిన గ్రానైట్ రాళ్లు

చీమకుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీలు విస్తరించిన ప్రాంతంలో ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉంది. రామతీర్థం నుంచి ఆర్‌ఎల్‌పురంనకు వెళ్లే రహదారికి ఇరువైపులా గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఈ రహదారి గుంతలమయమై అధ్వానస్థితికి చేరుకోవటంతో రవాణా కష్టతరంగా మారింది. వాహనదారులు తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నారు. ఇక భారీ లోడుతో వెళ్తున్న గ్రానైట్ ట్రాలీలు గుంతల్లో పడి బోల్తా పడటం పరిపాటిగా మారింది. ఇటీవల ఇలాంటి సంఘటన చోటుచేసుకొని తృటిలో ప్రాణప్రమాదం తప్పిపోయింది. ఈ సంఘటన మరచిపోకముందే శుక్రవారం రాళ్ల లోడుతో వెళ్తున్న మరో ట్రాలీ గుంతల ప్రభావంతో క్యాబిన్ ఊడిపోయి ట్రాలీలో ఉన్న రాళ్లు రోడ్డుపై జారిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పిపోయింది. ఇలా తరచుగా ఇలాంటి సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో అయినా పాలకులు కళ్లు తెరచి రహదారికి మరమ్మతులను తక్షణమే నిర్వహించాలని ఈ ప్రాంతవాసులు, వాహనదారులు, పరిశ్రమవర్గాలు కోరుతున్నారు.

పంచాయతీ ఖజానాలో రూ.20కోట్లు..

ఆర్‌ఎల్‌పురం పంచాయతీ పరిధిలో గెలాక్సీ గ్రానైట్ క్వారీలు విస్తరించి ఉన్నాయి. వీటినుంచి ప్రభుత్వం రాయల్టీ వసూలు చేస్తుంది. ఈ వసూలు అయిన రాయల్టీ డబ్బుల్లో కొంతమేర పంచాయతీకి సెస్ రూపంలో సమకూరుతుంది. ఇలా జమ అయిన నిధులు రూ.20కోట్లకు పైగా పంచాయతీ ఖజానాలో ఏడాదిన్నరకు పైగా మూలుగుతూనే ఉన్నాయి. పంచాయతీ పాలకవర్గం ఈ నిధులతో పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేసింది. ఈపనుల్లో రామతీర్థం-ఆర్‌ఎల్‌పురం రహదారి శాశ్వతప్రాతిపదికపై పునర్నిర్మాణం కూడా ఒకటిగా ఉంది. అయినా ఈ పనుల నిర్వహణకు టెక్నికల్ అనుమతులు అధికారులు మంజూరు చేయలేదు. ఇప్పటికైనా వరుస ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణాలకు ముప్పు రాకముందే అధికారులు అభివృద్ధి పనులు చేపట్టటానికి అనుమతులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

చీమకుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేవరపాలెం పరిసరప్రాంతాల్లోని పొలాల్లో గల పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.18,620 నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ దాసరి ప్రసాద్ తెలిపారు.

నేడు నూతన కోర్టు భవన సముదాయం ప్రారంభం

● హాజరుకానున్న హైకోర్టు జడ్జిలు

మార్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవన సముదాయ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం జరుగనున్నట్లు ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి తెలిపారు. ఉదయం 11.00 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్, జస్టిస్ వై.లక్ష్మణరావు, జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎస్.భారతిలు హాజరుకానున్నారన్నారు.

ఎస్సీ కాంప్లెక్స్ రూములకు దరఖాస్తులు చేసుకోవాలి

మార్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు సెంటర్‌లోని ఎస్సీ కాంప్లెక్స్‌లోని 5 రూములకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రూములను లీజు పద్ధతిపై అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను డిసెంబరు 10వ తేదీలోగా జిల్లా కేంద్రం ఒంగోలులోని ప్రగతి భవన్‌లోగల ప్రకాశం జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం కార్యాలయంలో అందజేయాలన్నారు.

యూరియా బస్తా... రూ.500

(5వ పేజీ తరువాయి)

వాడుతున్నట్లు వ్యవసాయ శాఖ ఎప్పుడో గుర్తించింది. పల్నాడు ప్రాంతంలో మిరప రైతులు కూడా యూరియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ముందుగానే కొనుగోలు చేస్తున్నారు. మాచర్లలో యూరియా రూ.420 నుంచి రూ.460కి తక్కువ అమ్మే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో చాలాచోట్ల రూ.450 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నారు. కొందరు రైతుల పేరుతో కొందరు, పలుకుబడి ఉపయోగించి మరికొందరు ముందుగానే కొనుగోలు చేసి వాటినే రైతులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

మేలుకోకపోతే ముప్పే..

ఖరీఫ్‌లో కేటాయింపులకు మించి ప్రభుత్వం యూరియాను సరఫరా చేసింది. అయినా కొరత ఉన్నట్లు ప్రచారం జరిగింది. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు వెళ్లిన వందల టన్నుల యూరియా కొందరికి మాత్రమే పంచేయడంతో వాస్తవ రైతులు కొరతతో ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో రబీలో ఎలా ఉంటుందోనన్న దానిపై సందిగ్ధం ఏర్పడుతుంది. వాస్తవానికి రబీలో గుంటూరు జిల్లాకు 55840 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం అవుతుంది. కానీ నిల్వలు ఆ మేరకు వస్తాయా లేదా అన్న దానిపై అనుమానం నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వం నిల్వల్లో 70 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీ లకు, 30 శాతం డీలర్లకు కేటాయిస్తుంది. లింక్ ఉత్పత్తులు తీసుకుంటేనే యూరియా ఇస్తామని డీలర్లు చెబుతున్నాయి.

తీరంలో సాగర్ కవచ్

నాగులుప్పలపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సముద్ర మార్గం నుంచి అక్రమంగా మన దేశంలోకి చొరబాట్లను అడ్డుకోవడంతో పాటు అనుమానాస్పద వస్తువులను గుర్తించేందుకు పోలీస్‌శాఖ చేపట్టిన సాగర్ కవచ్ విధులను మండల పరిధిలోని తీరప్రాంత గ్రామాల్లో మెరైన్, స్థానిక పోలీసులు శుక్రవారం నిర్వహించారు. చిన్నంగారిపట్టపుపాలెం తీరంలో మెరైన్ హోంగార్డ్ పోతురాజు ఆధ్వర్యంలో, కనపర్తి ప్రధాన కూడలి వద్ద పోలీసులు నిఘా విధులు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగులుప్పలపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు సమీపంలోని నాగన్నవాగు వద్ద గురువారం ముందు వెళుతున్న మోపెడ్ వాహనాన్ని కారు ఢీకొనడంతో అమ్మనబ్రోలుకు చెందిన పాతెం శ్రీనివాసరావు తీవ్ర గాయాలపాలయ్యారు. ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రెడ్డినగర్ వద్ద రోడ్డు ప్రమాదం

● చీమకుర్తి వాసి దుర్మరణం

● మరొకరికి తీవ్ర గాయాలు

చీమకుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం చీమలమర్రి సమీపంలో రెడ్డినగర్ వద్ద గల కర్నూల్‌రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకలు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ దాసరి ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. రెడ్డినగర్ సమీపంలో కర్నూల్‌రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆయా వాహనాలు నడుపుతున్న ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో ఒంగోలు వైపు వెళ్తున్న గ్రానైట్ కంటైనర్ కిందపడిన చీమకుర్తికి చెందిన ఏడుకొండలు(35) సంఘటనాస్థలంలో తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందాడు. .గాయపడిన మరో వ్యక్తిని సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ ప్రసాద్ తన వాహనంలో వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

బాలబాలికల ఖోఖో శిక్షణ శిబిరం

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14 బాల బాలికలకు వారం రోజుల పాటు జరిగే ఖోఖో శిక్షణను శుక్రవారం గ్రామ సర్పంచ్ మేదరమెట్ల నారాయణమ్మ ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జరగనున్న పోటీలకు అవసరమైన శిక్షణను క్రీడాకారులకు అందిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి హెచ్‌ఎం మాధవీలత అధ్యక్షత వహించారు. ఆంధ్రా ఖోఖో అసోసియేషన్ మాజీ సెక్రటరీ మేకల సీతారామిరెడ్డి మాట్లాడుతూ వారం రోజుల పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖోఖోలో శిక్షణ ఇస్తామన్నారు. ముండ్లమూరులో శిక్షణకు ముందుకు రావటం పీడీ సోమశేఖరరెడ్డితో పాటు గ్రామస్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డాక్టర్ చక్క వెంకటేశ్వర్లు, శిరీషాకుమారి, కేజీబీవీ ప్రిన్సిపల్ ఆవుల సునీత తదితరులు పాల్గొన్నారు.

గుండె.. గుబిల్లు

● ఎస్టీ కుటుంబాలకు వర్తించని ఉచిత విద్యుత్ పథకం ● ఒక లైటు, ఒక ఫ్యానుకు వేలలో బిల్లు


నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని 33వ వార్డు వడ్డే పుల్లయ్య యానాది కాలనీ వాసులు పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. కాలనీలో సుమారు 50 కుటుంబాలు ఉన్నాయి. వారంతా ఇళ్లల్లో పాచి పనిచేసుకుని జీవించే యానాది కాలనీ వాసులు. రెక్కాడితేనే డొక్కాడని బడుగు బలహీనులు. ఈక్రమంలోనే వారికి ఇంట్లో ఒక లైటు, ఒక ఫ్యాను. కాలనీ అంతా కలుపుకుని మహా అయితే పది మందికి మాత్రమే టీవీలు ఉన్నాయి. అయితే ప్రభుత్వం ప్రకటించిన ఎస్సీ, ఎస్టీలకు ఉచిత 200 యూనిట్లు కాలనీ వాసులకు అమలు కావడం లేదు. దాదాపుగా ప్రతీ ఇంటికి బిల్లు చెల్లింపులకు సంబంధించి డిమాండ్ నోటీసులు ప్రతినెలా అందుతున్నాయి. ఇదిలా ఉంటే ఒక్కో ఇంటికి రూ.400 నుండి రూ.1500 వరకు బిల్లులు వస్తుండటం శోచనీయం. అసలే పూట గడవడం కష్టం. అటువంటిది బిల్లులు వేలకు వేలు వస్తుండటంతో నిరుపేద కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి. సమస్య పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులను కలిసిన పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఇటీవల విద్యుత్ సిబ్బంది చాలాచోట్ల కటింగ్‌లు విధించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఒక్కొక్కరు రెండేసి వేలు కూడా బిల్లులు చెల్లించారు. విషయం తెలుసుకున్న ఆ సంఘం రాష్ట్ర నాయకులు బచ్చు రమణయ్య స్థానికులతో కలిసి నిరసన చేపట్టారు. కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్యాస్ట్ సర్టిఫికెట్ ఇస్తే సరిచేస్తాం

వారు ఎస్టీలు అయినప్పటికీ, వివిధ కారణాలతో ఇంకా కులధ్రువీకరణ పత్రాలు మాకు ఇవ్వలేదు. ఇస్తే 200 యూనిట్లలోపు కరెంటు బిల్లు లేకుండా చూస్తాం.

పట్టణ ఏఈ శంకర్

రూ.2397 వేలు బిల్లు కట్టాను



పూట గడవక అవస్థ పడుతుంటే వేలకు వేలు బిల్లులు కట్టాలంటే స్థోమత లేదు. గతంలో బిల్లు సంగతి అవగాహన లేదు. ఇటీవల విద్యుత్ సిబ్బంది వచ్చి రూ.2397 కట్టాలని లేకుంటే ఇబ్బంది పడతారని హెచ్చరించడంతో అప్పుచేసి కట్టాను.

- చౌటూరి మహాలక్ష్మీ, స్థానికురాలు

ప్రభుత్వం ఉచితమంటోంది .. అధికారులు బిల్లుకట్టమంటున్నారు

కరెంట్ బిల్లు ఉచితమని ప్రభుత్వం చెబుతోంది. విద్యుత్ అధికారులు బిల్లు కట్ట మంటున్నారు. ఇళ్లల్లో పాచీ పని చేసుకుని గడుపుతున్నాను. అయినా సరే ప్రతీనెల బిల్లు కడుతున్నా. కానీ విపరీతంగా బిల్లు వస్తుంది. ఈ నెల కూడా రూ.1475 వచ్చింది. ఒక్క లైటు, ఫ్యానుకు అంత బిల్లు ఎందుకు కట్టాలో అర్థంకావడం లేదు.

- పోట్లేరు పోలమ్మ, స్థానికురాలు



అధికారులు మా గోడు పట్టించుకోవాలి

తినోతినకో గడుపుతుంటే కరెంట్ బిల్లులు మోత మోగుతు న్నాయి. మాకు ఉచిత విద్యుత్ అమలు కావడం లేదు. ప్రతీనెల బిల్లులు చెల్లిస్తున్నాము. ఆలస్యమైతే కోతలు విధిస్తున్నారు. అధికారులు మా గోడు పట్టించుకోవాలి.

- పుట్టాల నాగమ్మ, స్థానికురాలు



అవీ..ఇవీ..

తైక్వాండోలో మెరిసిన సెయింట్‌ఆన్స్ విద్యార్థులు


క్రీడాకారులతో కళాశాల ప్రతినిధులు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు మెరిశారు. ఇటీవల కాకినాడలో 41వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ క్యొరుజీ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థులు పందరబోయిన భానురేఖ, ఎస్కే షాహిదా, సీహెచ్ అభిరామ్ వివిధ కేటగిరీల్లో స్వర్ణ, రజిత, కాంస్య పతకాలు సాధించారు. ఈక్రమంలో శుక్రవారం కళాశాలలో సెక్రటరీ వనమారామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిశితంగా ప్రతి అర్జీ పరిశీలన


అర్జీలు స్వీకరిస్తున్న కూటమి నేతలు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీనీ ఎమ్మెల్యే కొండయ్య నిశితంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేసున్నట్లు పలువురు కూటమి నేతలు పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ నియోజక వర్గ క్యాంపు కార్యాలయంలో నేతలు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు గంజి పురుషోత్తం, గోలి జగదీష్, గూడూరు శివరామప్రసాద్ ప్రజల నుంచి వచ్చిన 155 అర్జీలు స్వీకరించారు. వాటిల్లో నివేశన స్థలాలు 110, పింఛన్ సమస్యలు 25, ఇతర సమస్యలకు సంబంధించి మరో 20 అర్జీలు అందినట్లు చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కారించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వరలక్ష్మీ పలువురు కార్యకర్తలు, అర్జీదారులు పాల్గొన్నారు.

చేనేతకు ప్రభుత్వాలు తోడ్పాటు అందించాలి

● ఈనెల 30న చీరాలలో రాష్ట్ర చేనేత సదస్సు
● పోస్టర్ ఆవిష్కరించిన పలు సంఘాల నేతలు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చేనేత, పలు సంఘాల నేతలు

పేరాల(చీరాల), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చేనేత రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు అందించి నేతన్నలను ఆదుకోవాలని చేనేత, పలు సంఘాల నేతలు అన్నారు. ఈ నెల 30న రాష్ట్ర చేనేత సదస్సు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అందుకు సంబంధించి పేరాల గోలి సదాశివ కల్యాణ మండపంలో దామర్ల శ్రీకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.పరంజ్యోతి, వేమేశ్వరీ, ఆశీర్వాదం, చుండూరి వాసు, భాస్కరరావు, వెంకట్రావు లక్ష్మీ నారాయణ, రవికుమార్ చేనేత ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాలువకట్ట రోడ్డు


కోసుకుపోయిన కాలువ కట్ట రోడ్డు

మేదరమెట్ల, నవంబరు 21 : జాతీయ రహదారి నుంచి కుర్రవానిపాలెంకు వెళ్లే కాలువ కట్ట రోడ్డు పలుచోట్ల ప్రమాదభరితంగా మారింది. ఈ మార్గంలో కూరగాయలు తరలించే వాహనాలు ఎదురెదురుగా వస్తే తప్పుకునే వీలు కూడాలేదు. ఏదో ఒక వాహనం వెనక్కు వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రాంతమంతా కూరగాయలు పండిస్తుంటారు. ఇక్కడ పండిన కూరగాయలను రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. జాతీయ రహదారి నుంచి పి.గుడిపాడు మీదుగా వెళ్లే ఈ రోడ్డు సాగర్ కాలువ నుంచి పి.గుడిపాడు చెరువుకు నీరు వెళ్లేచోట కాలువ కట్ట పూర్తిగా దెబ్బతింది. వాహనదారులు ఈ రోడ్డులో ప్రయాణించడానికి భయపడుతున్నారు. ఇటీవల ఈ రోడ్డులో తారురోడ్డు వేయకుండా మిగిలిన రోడ్డును తారురోడ్డుగా మార్చడానికి రూ.17 లక్షలు మంజూరు చేశారు. దీనిలో భాగంగా దెబ్బతిన్న కాలువకట్టను కూడా బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి గ్రామసభలు

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామకంఠం స్థలాలకు హక్కు నిర్ధారణరకు నిర్వహించిన స్వామిత్వ సర్వేపై శనివారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరూధిని తెలిపారు. శనివారం ధేనువకొండ, 24న చక్రాయపాలెం, నన్నూరపాడులలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్యసమావేశం

మేదరమెట్ల, నవంబరు 21 : కొరిశపాడు మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో చంద్రసేన్ తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలు


షెడ్యూలను వివరిస్తున్న కార్యనిర్వాహకురాల ప్రతిమ

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో ఈ నెల 23 నుంచి 25 వరకు ఎస్‌జీఎఫ్. 69వ రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నారు. చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా జరుగ నున్న ఈ పోటీలకు సంబంధించిన వివరాలను శుక్రవారం కమిటీ ఛైర్మన్ చందలూరి గిరిజ అధ్యక్షతన పాఠశాలలో జరిగిన ప్రత్యేక సమావేశంలో నిర్వాహక కార్యదర్శి, (ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి) కొండా ప్రతిమ వెల్లడించారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలలో బాల, బాలికల యోగాసన రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రెడిషనల్, ఆప్షనల్, ఆర్టిస్టిక్ ఈవెంట్లలో బాల బాలికలకు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చాటిన వారిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారన్నారు.

హాజరుకానున్న 450 మంది బాలబాలికలు

ఈ పోటీలలో పాల్గొనేందుకు 13 ఉమ్మడి జిల్లాల నుంచి 450 మంది బాల, బాలికలు చందలూరు గ్రామం చేరుకోనున్నట్లు తెలి పారు. వీరితో పాటు జట్టు కోచ్‌లు, మేనేజర్లు, ఎన్ఐఎస్. క్వాలిఫైడ్ న్యాయ నిర్ణేతలు హాజరవుతున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో పాటు గ్రామస్థులు స్థానిక ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల వ్యాయామో పాధ్యాయులు పోటీల నిర్వహణకు తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుండి పోటీలలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న బాలురకు స్థానిక ఉన్నత పాఠశాలలో, బాలికలకు గ్రామస్థుల సహకారంతో నివాస గృహాలలో వసతి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఏక కాలంలో మూడు వేదికలపై పోటీలు

వివిధ విభాగాలకు సంబంధించి మూడు రోజులలో పూర్తికానున్న ఈ యోగాసన పోటీలు ఏకకాలంలో మూడు వేదికలపై ఆయా ఈవెంట్లను నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ చందలూరి గిరిజతో పాటు అజిత్ ట్రస్ట్ ఛైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, నిర్వాహక కమిటీ ప్రతినిధులు పెంట్యాల రామలింగస్వామి, అడ్డగడ సుబ్బయ్య, రావి శ్రీనవాసరావు, వసంత రఘుబాబు, వీ.అరుణ, ఏ.కొండలరావు పాల్గొన్నారు.

సంక్షోభంలో ఉన్న పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలి

గ్రానైట్ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య


మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు మస్తానయ్య

బల్లికురవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమలను ప్రభుత్వం తక్షణమే అదుకోవాలని గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వేమవరం వద్ద ఉన్న లలిత ఇండస్ట్రీస్‌లో ఫ్యాక్టరీల యజమానులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ పరిశ్రమలు నష్టాలబాటలో ఉన్నాయని, ఈ అంశాన్ని తాము ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి పరిశ్రమలకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన తెలిపారు. కమిటీ నిర్ణయం వచ్చే వరకు వేచి చూసి మరో మారు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకు వెళతామన్నారు. ప్రకాశం జిల్లాకు, బాపట్ల జిల్లాకు ఒక్కో కట్టర్‌కు రూ.7 వేల వ్యత్యాసం ఉందని లోగ్రేడ్ రాయికి సీనరేజ్ తగ్గించాలని పలువురు యజమానులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కొందరు విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేక ఫ్యాక్టరీలు మూత వేస్తున్నారని ప్రభుత్వం అదుకోకుంటే నష్టాలు మరింత తప్పవని వారు సమావేశంలో వాపోయారు. సమావేశంలో యజమానులు సుధాకర్, అప్పిరెడ్డి, రంగనాథ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు

అద్దంకి : కార్తీక మాసం ముగింపులో భాగంగా శుక్రవారం పోలిస్వర్గం పూజలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చినకాశీగా ఖ్యాతికెక్కిన మణికేశ్వరంలో భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించుకొని స్వామి వారిని దర్శించు కున్నారు. అరటి దొప్పలలో వత్తులు వెలిగించి గుండ్లకమ్మ నదిలో వదిలారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అద్దంకి పట్టణంలోని పాతశివాలయం, వేయిస్థంభాల గుడి, కమతేశ్వరాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీకదీపాలు వెలిగించి స్వామి వార్ల ను దర్శించుకున్నారు.

పంగులూరు : మండలంలోని రామకూరు కొండపై శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కార్తీకమాసం ముగిసిన అనంతరం పోలిస్వర్గం సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ కొండపై కొలువుదీరిన శ్రీరామ లింగేశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహాగణపతి పూజ నిర్వహించిన అర్చకస్వాములు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి అన్న సంతర్పణ చేశారు.

చినగంజాం : కార్తీకమాసం ముగియడంతో శుక్రవారం వేకువజామున మహిళలు పోలిస్వర్గ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పోలిస్వర్గాన్ని పురస్కరించుకొని కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం, స్థానిక గంగా పార్వతి సమేత చిదంబరేశ్వరస్వామి, పలు శైవక్షేత్రాల వద్దకు మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. నెలరోజుల పాటు భక్తిశ్రద్ధలతో కార్తీక మాసం వ్రతం ఆచరించిన మహిళలు అంతా కార్తీకమాసం ముగింపురోజున అరటి బోదెలలో దీపాలు వెలిగించి వాటిని కొలనులు, నదులలో వదలడం సాంప్రదాయంగా వస్తోంది. భారీ సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు భక్తిశ్రద్ధలతో వెలిగించి వదిలిన దీపాలతో బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కోనేరు దీపకాంతులతో నిండింది. పోలిస్వర్గ కథను అర్చకస్వాములు భక్తులకు విశదీకరించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని శైవ క్షేత్రాల్లో భక్తులు పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.


బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద కోనేటిలో దీపాలు వదులుతున్న మహిళలు


అద్దంకిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చందలూరు- గంగవరం రోడ్డు నిర్మాణానికి చర్యలు


రహదారిని తనిఖీ చేస్తున్న అధికారులు

పంగులూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామం నుంచి గంగవరం వరకు బీటీరోడ్డు పునర్నిర్మాణానికి పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు నిడివిని అంచనా వేసేందుకు అధికారులు శుక్రవారం ప్రాథమికంగా కొలతలు చేపట్టారు. ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నూతనంగా బీటీ.రోడ్డు నిర్మించేందుకు రూ.2 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో రెండు గ్రామాల మధ్య 3.7 కిలోమీటర్ల పొడవున 3.75 మీటర్ల వెడల్పుతో బీటీరోడ్డు నిర్మించనున్నట్లు పీఆర్‌ఏఈ హనుమంతరావు తెలిపారు.

ఖోఖో జిల్లా జట్టుకు అకాడమీ క్రీడాకారుల ఎంపిక


పోటీలకు ఎంపికైన ఎస్ఆర్ఆర్. అకాడమీ క్రీడాకారులు

పంగులూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి బాలుర ఖోఖో పోటీలలో పాల్గొనే జిల్లా జట్టులో 9 మంది ఎస్ఆర్ఆర్ అకాడమి క్రీడాకారులు పాల్గొంటున్నట్లు అకాడమి డైరక్టర్ ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. ఈనెల 18న సింగరాయకొండ మండలం పాకలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఖోఖో జిల్లా బాలుర జట్టు ఎంపికలో పంగులూరు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందుతున్న పి.నవీన్, పి.వెంకటేశ్వర్లు, వి.సాయిచరణ్, షేక్ మహ్మద్ ఆషిఫ్‌అలీ, బి.తిరుమల, ఇ.గణేష్, డి.హేమంత్, జె.ఎల్లప్ప, ఎం.అక్షయ్‌కుమార్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరిలో పి.ఎంకటేశ్వర్లు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతుండగా మిగిలిన ఎనిమిది మంది పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతూ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు.

హెల్మెట్ ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన


హెల్మెట్లతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్ బృందం

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డుభద్రత నియమాలు పాటించాలని ఎస్ఐ వినోద్‌బాబు సూచించారు. మండలంలోని రేణింగివరం ప్రధాన రహదారితో పాటు సర్వీస్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఎస్ఐ వినోద్‌బాబు నేతృత్వంలో పోలీసులు హెల్మెట్ ధరించి బైక్‌ర్యాలీ నిర్వహించారు. వాహనచోదకులకు హెల్మెట్ అవసరాన్ని తెలియచేస్తూ రోడ్డుభద్రతా నియమాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

చినగంజాం : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చినగంజాం ఎస్.ఐ శీలం రమేష్ హెచ్చరించారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో శుక్రవారం రాత్రి ద్విచక్రవాహదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం సేవించి వాహననాలు నడపరాదని ఎస్.ఐ అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్ర తా నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణాలు చేయాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 30 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగు సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో అందుకు సంబంధించి నాయకులతో కలిసి విరాళాలు సేకరించారు. కార్మికుల సమస్యల పరిష్కారంకు కృషి చేస్తున్న యూనియన్ సభలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వసంతరావు, బాబురావు, ఇమ్మానియేల్, సామ్యేల్, సాగర్, సింగయ్య, కోటేశ్వరమ్మ, మరియమ్మ, ఆదిలక్ష్మీ, రాజేశ్వరీ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

మండల అకడమిక్‌ఫోరం ఏర్పాటు


మాట్లాడుతున్న బాలప్రసాద్

కారంచేడు(పర్చూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యాబోధన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని దీనిలో భాగంగా మండల అకడమిక్ ఫోరంలను ఏర్పాటు చేసినట్లు ఫోరం అధ్యక్షుడు బొప్పూడి బాలప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుంకలమర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల అభ్యసనా స్థాయిలను పరిశీలించారు. కరదీపికలు, సమగ్ర అభివృద్ధి పత్రాలు, మార్కులు, గ్రేడులపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో స్వర్ణ, కుంకలమర్రు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎం.వీసుబ్బారావు, బి.బాలప్రసాద్, సబ్జెక్ట్ నిపుణులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన డిప్యూటీ ఈవో

యద్దనపూడి,(మార్టూరు)నవంబరు21(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని అనంతవరం హైస్కూల్ ను డిప్యూటీ డీఈవో గంగాధర్ శుక్రవారం సందర్శించారు.వార్షిక తనిఖీలలో భాగంగా ఆ య న హైస్కూల్ ను సందర్శించారు.ఈ సందర్భంగా స్కూల్ లోని విద్యార్థుల హాజరుపట్టీని,స్కూల్ లో విద్యార్థులకు గల వసతులను మధ్యాహ్నాబోజనాన్ని పరిశీలించారు.ఉపాధ్యాయులతో మాట్లాడారు.10 తరగతి పరీక్షలలో విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులు అ య్యే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.అనంతరం నూరవరపువల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు.